


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 28 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 74 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వం బలవంతం పెట్టలేదు'

మంత్రి ఆదిమూలపు సురేష్



బద్వేలు(వైఎస్సార్ కడప): ప్రైవేట్ ఎయిడెడ్ విద్యాసంస్థలపై కమిటీ వేశామని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కొన్ని పత్రికలు కావాలనే తమపై.. తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వం బలవంతం పెట్టలేదని స్పష్టం చేశారు. విద్యాసంస్థల అంగీకారంతోనే ప్రభుత్వం వాటిని తీసుకుందని అన్నారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకున్నామని అన్నారు. విద్యాసంస్థల అభివృద్ధి కోసమే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఒక వేళ .. ప్రైవేట్ విద్యాసంస్థలు తామే నడుపుకుంటామంటే స్కూళ్లను వెనక్కి తీసుకోవచ్చని మంత్రి సురేష్ అన్నారు. కొన్ని చోట్ల కనీస వసతులు లేవని అన్నారు. తల్లిదండ్రులపై ఎలాంటి బలవంతపు ఒత్తిడి చేయడం లేదని అన్నారు. విద్యార్థులకు.. దగ్గరలో ఉన్న స్కూల్స్‌లో చేరేందుకు అవకాశం కల్పిస్తామని అన్నారు. దీనిపై కూడా టీడీపీ రాజకీయం చేస్తోందని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో వసతులు కల్పించకుండా పోస్టులు ఖాళీగా ఉంచిందని అన్నారు. ఏపీలో నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు.కార్పొరేట్‌కు ధీటుగా విద్యా విధానం ఉండాలనేదే.. తమ ప్రభుత్వం ఆలోచన చేస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం చూసి ఓర్వలేక.. ప్రతిపక్షాలు ప్రభుత్వం పై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నాయని అన్నారు. తల్లిదండ్రులను అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తున్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం చేయడం దుర్మార్గమని మంత్రి ఆదిమూలపు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఎయిడెడ్ విద్యా సంస్థలు ఎలా వచ్చాయో కూడా తెలియని వాళ్లు కూడా మాట్లాడుతున్నారని ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తమ ప్రభుత్వం.. విద్యా రంగం అభివృద్ధికి అనేక సంస్కరణల్లో భాగంగానే చర్యలు తీసుకుంటుందని అన్నారు. రెగ్యులేటరీ కమిషన్ ఫిక్స్ చేసిన ఫీజ్ కంటే ఎక్కువ వసూలు చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఆదిమూలపు సురేష్ హెచ్చరించారు. ప్రతి పక్షాలు బాధ్యతగా నిర్మాణాత్మక ఆరోపణలు, సూచనలు చేయాలని మంత్రి సురేష్ హితవు పలికారు.

## పర్యాటక రంగానికి 'ఏపీ' చిరునామాగా మారాలి: సీఎం జగన్



తాడేపల్లి: స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డుపై తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షా సమావేశం చేపట్టారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న భారీ టూరిజం ప్రాజెక్టులపై బోర్డు సమావేశం ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఏపీలో పర్యాటక రంగాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లనున్నారు. ఒక్కో ప్రాజెక్టుపై కనీసం రూ.250 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. వివిధ ప్రాజెక్టులపై మొత్తంగా రూ.2868.6 కోట్లు వెచ్చించనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 48 వేల మందికి ఉద్యోగాల అవకాశాలు దక్కనున్నాయి. దాదాపు 1,564 గదులు కొత్తగా అందుబాటులోకి వస్తాయి. వీటిని కంపెనీలు ఐదేళ్ల కాలంలో పూర్తి చేయనున్నాయి.

కీలక ప్రాజెక్టుల వివరాలు..

విశాఖపట్నం, తిరుపతి, గండికోట, హార్సిలీహిల్స్, పిచ్చుకలంకలో ప్రఖ్యాత కంపెనీ ఒబెరాయ్ అధ్వర్యంలో రిసార్టులు

### స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డుపై సీఎం జగన్ సమీక్ష

ఓబెరాయ్ విలాస్ బ్రాండ్‌తో రిసార్టులు

విశాఖపట్నం శిల్పారామంలో హయత్ ఆధ్వర్యంలో స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్

తాజ్ వరుణ్ బీచ్ పేరుతో విశాఖలో మరో హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్

విశాఖపట్నంలో టన్నెల్ ఆక్వేరియం, స్కైటవర్ నిర్మాణం

విజయవాడలో హయత్ ప్యాలెస్ హెటల్

అనంతపురం జిల్లా పెనుగొండలో జ్ఞానగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఇస్కాన్ ఛారిటీస్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం ఏర్పాటును ప్రభుత్వం ప్రతిపాదించగా ఎస్ఐపీబీ వీటికి ఆమోదం తెలిపింది.

ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఏమన్నారంటే..

పర్యాటక రంగానికి ఏపీ చిరునామాగా మారాలి అని అధికారులకు సీఎం నిర్దేశం.

టూరిజం అంటే ఏపీ వైపే చూడాలి

ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రాజెక్టులు ఉండాలి

అత్యాధునిక వసతులు అందుబాటులోకి రావాలి

నిర్దేశిత సమయంలోగా ప్రాజెక్టులు వచ్చేలా చర్యలు తీసుకోండి

ఆధునిక వసతలు అందుబాటులోకి రావడం వల్ల టూరిజం పరంగా రాష్ట్రం స్థాయి పెరుగుతుంది

పెద్ద సంఖ్యలో దేశ విదేశాల నుంచి పర్యాటకులు పెరుగుతారు

ప్రత్యక్షంగా, పరోక్షంగా దీనిపై ఆధారపడేవారికి మెరుగైన అవకాశాలు వస్తాయి

తద్వారా ఉద్యోగాల కల్పన, ఉపాధి పెరుగుతాయి

విశాఖపట్నంలో లండన్ ఐ తరహా ప్రాజెక్టును తీసుకురావడంపై దృష్టి పెట్టాలి అని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశానికి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ, పరిశ్రమలశాఖ స్పెషల్ సీఎస్ కరికాల్ వలవెన్, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, జీఏడీ స్పెషల్ సీఎస్ కె ప్రవీణ్ కుమార్, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ ఎస్ రావత్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి వి ఉషారాణి, అటవీ పర్యావరణశాఖ కార్యదర్శి జి విజయ్‌కుమార్, నీటిపారుదలశాఖ కార్యదర్శి జె శ్యామలరావు, ఇంధనశాఖ కార్యదర్శి నాగులాపల్లి శ్రీకాంత్, పరిశ్రమలశాఖ డైరెక్టర్ జి సృజన, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## అసాంఘిక శక్తులకు రారాజు చంద్రబాబు: విజయసాయిరెడ్డి

### ఏం ప్రయోజనం కోసం చంద్రబాబు ఢిల్లీ వచ్చారు? ఎంపీ విజయసాయిరెడ్డి

న్యూఢిల్లీ: పట్టాభి తిట్లను సమర్థించుకోవడానికే చంద్రబాబు ఢిల్లీ వచ్చారా? అని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన ఢిల్లీలో జాతీయ మీడియా తో మాట్లాడుతూ, అసాంఘిక శక్తులకు రారాజు చంద్రబాబు అంటూ మండిపడ్డారు. వ్యవస్థలను మేనేజ్ చేయడానికి ఢిల్లీ వచ్చారా.. ఏం ప్రయోజనం కోసం వచ్చారు? అంటూ దుయ్యబట్టారు. ఉద్దేశ్యపూర్వకంగానే పట్టాభితో తిట్టించారని నిప్పులు చెరిగారు. పట్టాభి వ్యాఖ్యలపై సహజంగానే ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. "పట్టాభి అనభ్య పదజాలాన్ని చంద్రబాబు సమర్థిస్తున్నారా? చంద్రబాబు నాయుడే ఒక టెర్రరిస్ట్. గంజాయి వ్యాపారంలో లోకేష్ పాత్ర ఉందని ప్రజలందరికీ తెలుసు. ఆంధ్రరాష్ట్ర పరువును చంద్రబాబు దిగజారుస్తున్నారని" విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. "టెర్రరిస్ట్ ముఠాకు



చంద్రబాబు నాయకుడు. పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు బాబు యత్నిస్తున్నాడు. చంద్రబాబు ఢిల్లీ ఎందుకు వచ్చారు?. అమిత్‌షాపై రాళ్లు వేయించిన వీడియో చూపించావా?. మహానాడులో ఆర్టికల్ 356 రద్దుపై తీర్మానం చేశారు. ఇప్పుడు అదే ఆర్టికల్ ఏపీలో ప్రయోగించాలంటున్నారు. డ్రగ్స్ వ్యాపారం చేసింది చంద్రబాబు,లోకేషే. చంద్రబాబు హయాంలో గంజాయిసాగుపై అప్పటి మంత్రి గంటా ఏం చెప్పారో ఆ వీడియో కూడా వినాలని" విజయసాయిరెడ్డి అన్నారు.

## చంద్రబాబుకు అమిత్ షా ఫోన్..

## రాష్ట్ర పరిణామాలపై చర్చ

దిల్లీ: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా కార్యాలయాలపై జరిగిన దాడి వివరాలు, ఇతరత్రా అంశాలపై చర్చించేందుకు చంద్రబాబు ఇటీవల దిల్లీ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. దిల్లీ పర్యటనలో భాగంగా చంద్రబాబు.. అమిత్ షా అపాయింట్‌మెంట్ కోరారు. అదే సమయంలో కశ్మీర్ పర్యటన, వరుస కార్యక్రమాల కారణంగా అమిత్ షా సమయం ఇవ్వలేకపోయారు. కశ్మీర్ పర్యటన నుంచి తిరిగొచ్చిన అమిత్ షా ఇవాళ



చంద్రబాబుకు ఫోన్ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై అమిత్ షాతో చర్చించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం నడుస్తోందని ఈ సందర్భంగా రాష్ట్ర పరిణామాలను చంద్రబాబు అమిత్‌షాకు వివరించినట్లు సమాచారం. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా తెదేపా నేతలు పోరాడుతుంటే వైకాపా దాడులకు తెగపడటంతో పాటు పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ బాధితులపైనే అక్రమ కేసులు బనాయిస్తోందని ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## ప్రధానిని కలిసేందుకు జగన్, విజయసాయి ఎందుకు భయపడుతున్నారు?: దేవినేని

అమరావతి: తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలను ఉగ్రవాదులు అంటున్నారని.. మరి తెదేపా పార్టీ కార్యాలయాలపై దాడి చేసిన వాళ్లు అహింసావాదులా? అని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. ఏ ఆధారాలున్నాయని ఉగ్రవాదులంటున్నారని దేవినేని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో దేవినేని మీడియాతో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై పోలీసులు ఎవరికి నోటీసులు ఇస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 28 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా సాధ్యమన్నారని.. మరి ఇంతవరకు ప్రత్యేక హోదాపై ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ప్రత్యేక హోదాపై వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి



ఏనాడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. 28 మంది ఎంపీలు ఉన్నా ప్రధాని మోదీని ఎందుకు కలవలేకపోయారని.. ప్రధానిని కలిసేందుకు సీఎం జగన్, విజయసాయి ఎందుకు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆర్థిక ఉగ్రవాది విజయసాయిరెడ్డి వద్ద తెదేపా అధినేత చంద్రబాబు నడవడిక నేర్చుకోవాలా? చంద్రబాబు పోరాడుతుంటే విజయసాయిరెడ్డికి దిల్లీలో వణుకొస్తోందని దేవినేని పేర్కొన్నారు.


## కాంగ్రెస్ ,బీజేపీ లకు డిపాజిట్ రాకుండా బుద్ధి చెప్పండి: అంబటి రాంబాబు

బద్వేలు (వైఎస్సార్ కడప): బద్వేలు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దాసరి సుధ విజయం ఖాయమని ఎమ్మెల్యే అంబటి రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఏ ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. గెలిచే ఎన్నిక అయినా.. భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంపై అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఎందుకు ఓటువేయాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని చీల్చింది.. అంతరించిపోతుంది. అదే విధంగా.. బీజేపీ రాష్ట్రానికి అన్యాయం చేస్తోంది.. ప్రస్తుతం దాని ఉనికే లేదని విమర్శించారు. కాంగ్రెస్ , బీజేపీ లకు డిపాజిట్ రాకుండా బుద్ధి చెప్పండని తీవ్ర



స్థాయిలో విమర్శించారు.టీడీపీ, జనసేనలు పోటీలో నిలవకుండా లోపాయకారి ఒప్పందం కుదుర్చుకున్నాయని అంబటి రాంబాబు విమర్శించారు. పవన్ కళ్యాణ్ ద్వంద్వ వైఖరిపై తక్షణం క్లారిటీ ఇవ్వాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. బద్వేలు బరిలో మొత్తం 15 మంది అభ్యర్థులు ఉన్నారు. ఈ నెల 30న బద్వేలుకు ఉప ఎన్నిక జరగనుంది.

## చంద్రబాబు బూతు పంచాంగం డ్రామా ఫెయిల్: సజ్జల



తాడేపల్లి(వైఎస్సార్ కడప): పచ్చమీడియా ద్వారా చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలన దృష్టి మరల్చేందుకు టీడీపీ కుట్రలు చేస్తుందని విమర్శించారు. అబద్ధాలు, వంచన, డ్రామా బాబుకు తెలిసిన ఏకైక విద్య అని సజ్జల మండిపడ్డారు.బాబు, ఢిల్లీకి వెళ్లటం పచ్చమీడియా పెద్ద వార్తగా ప్రచారం చేస్తోంది. కాగా, బాబు బూతు పంచాంగం డ్రామా ఫెయిల్ అయ్యిందని ఎద్దేవా చేశారు. ఢిల్లీ టూర్ పేరుతో చంద్రబాబు పెద్ద డ్రామా నడిపారని అన్నారు. డ్రగ్స్‌పేరుతో రాష్ట్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు, చర్యలు ఏపీకి తీవ్ర నష్టం కలిగే విధంగా ఉన్నాయని సజ్జల రామకృష్ణా రెడ్డి విమర్శించారు. తనకు ఓటు వేయని ప్రజలపై చంద్రబాబు పగ తీర్చుకుంటున్నారని అన్నారు. ఢిల్లీ స్థాయిలో ఏపీ పరువు తీసేందుకు టీడీపీ కుట్రలు చేస్తుందని అన్నారు. అబద్ధాలు ప్రొజెక్ట్ చేయడంలో చంద్రబాబుకు మించినవాళ్లులేరని అన్నారు. అమిత్ షా ఫోన్ చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. కాగా, ఎయిడెడ్ స్కూళ్లపై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఏపీలో జరిగిన ఆందోళనల్లో టీడీపీ పార్టీ ప్రమేయం ఉందని సజ్జల మండిపడ్డారు.

## టీసీ లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరటంపై హైకోర్టు తీర్పు

అమరావతి: టీసీ లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరటంపై హైకోర్టు తీర్పునిచ్చింది. ప్రైవేట్ స్కూల్స్ టీసీలు ఇచ్చే విషయంలో అధికారులు ఒత్తిడి తీసుకురావద్దని హైకోర్టు సూచించింది. టీసీలు లేని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లిఖితపూర్వక హామీ తీసుకోవాలని కోర్టు తెలిపింది. విద్యార్థులు టీసీ లేకుండా మరో పాఠశాలలో చేరితే 30 రోజుల్లో పాఠశాలకు వెళ్లి టీసీ తీసుకోవాలని హైకోర్టు సూచించింది. పిటిషనర్ల తరపున ముతుకుమల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపించారు.

# సంపాదకీయం

గురువారం 28 అక్టోబరు 2021

## దేశవ్యాప్తంగా 11 లక్షల టీచర్ల పోస్టులు ఖాళీ... 69 శాతం గ్రామీణ ప్రాంతాలలోనే

దేశంలో విద్యా రంగం ఎంత అధ్వాన్న స్థితిలో ఉందో యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ అద్దంలో స్పష్టంగా చూడొచ్చు. దేశ వ్యాప్తంగా 11 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అందులో 69 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఏర్పడ్డాయనీ, భారత దేశంలో విద్యాస్థాయిపై విడుదలైన యునెస్కో నివేదిక 2021 వెల్లడించింది. దేశంలో ఒకే టీచర్‌తో నడుస్తున్న పాఠశాలలు లక్ష వరకు ఉన్నట్టు ఈ నివేదిక కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. ఉపాధ్యాయులు లేరు తరగతులూ లేవు అనే శీర్షిక కింది వెలువడిన ఈ నివేదిక మన దేశంలో విద్యా రంగం గురించి మరెన్నో బాధాకరమైన అంశాలను పూసగుచ్చింది. దేశంలో 18–29 సంవత్సరాల్చొన వారు 22 శాతం ఉన్నారు. అంటే 26 కోట్ల 10 లక్షల మంది. 10–24 వయసులోని యువత 35 కోట్ల 60 లక్షల మంది. సంపద పెంచడానికి అవసరమైన యువత ఇంతగా ఉండగా, వారికి ఆధునిక చదువులు, నైపుణ్యాలు కలిగించలేకపోడం మన పాలకుల వైఫల్యమే. ఐదవ తరగతి చదువుకొంటూ రెండవ తరగతి వాచకం నిర్దుష్టంగా చదవడం చేతగాని విద్యార్థులు దేశంలో అసంఖ్యాకంగా ఉన్నారు. అలాగే 10వ తరగతిలోని విద్యార్థులు 8వ తరగతి లెక్కలు చేయలేకపోడం, వాక్యాలు రాయలేకపోడం వంటి దుర్గతి మన విద్యా రంగాన్ని పీడిస్తున్నది. మొత్తంగా దేశంలో తయారవుతున్న పట్టభద్రుల్లో, సాంకేతిక విద్యోన్నతుల్లో వస్తూత్పత్తికి అవసరమైన తెలివితేటలుండి పరిశ్రమల యజమానులను సంతృప్తి పరచగల నేర్పు, నైపుణ్యాలు గలవారు బహు తక్కువగా ఉండడమే మన విద్యా రంగం చేతగాని తనాన్ని రుజువు చేస్తున్నది. ప్రాక్టికల్స్ కంటే పాఠాలకే ప్రాధాన్యమిచ్చే పనికిరాని విద్యా విధానం మనది అనడం సాహసమనిపించవచ్చు గాని ముమ్మాటికీ వాస్తవం. యునెస్కో నివేదిక ప్రకారం పూర్వ ప్రాథమిక విద్య నేర్పుతున్న ఉపాధ్యాయుల్లో 7.7 శాతం మంది, ప్రాథమిక స్థాయి చదువు చెబుతున్న వారిలో 4.6 శాతం మంది, ప్రాథమికోన్నత టీచర్లలో 3.3 శాతం మంది ఆ స్థాయికి తగిన విద్యార్హతలు లేనివారేనని వెల్లడైంది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులను గత ఏడాది కంటే 6.13 శాతం తగ్గించిన చేదు వాస్తవమే మన పాలకులకు ఆ రంగాన్ని చక్కదిద్దడంపై గల మక్కువ వెల్లడవుతున్నది. విద్య పట్ల కేంద్ర ప్రభుత్వమే ఇంత చిన్నచూపు చూపుతుంటే రాష్ట్రాలు ఇంకెంత తక్కువ ప్రాధాన్యత ఇస్తాయో ఊహించవచ్చు. సర్వశిక్షాఅభియాన్ ప్రాథమిక విద్యా స్థాయిలో బాలికల చదువును మెరుగుపరిచే జాతీయ కార్యక్రమం, మధ్యాహ్న భోజన పథకం, విద్యా హక్కు చట్టం, బేటీ బచావో, బేటీ పడావో, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ, మైనారిటీ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడమే తప్ప అవి దేశంలోని బాలల్లో సాధిస్తున్న విద్యా వికాసం ఎటువంటిదో తెలియదు. దానిని పరిశీలించి తగిన మెరుగుబాటు చర్యలు తీసుకునే వ్యవస్థ దాదాపు లేదనే చెప్పవచ్చు. 201920 సంవత్సరంలో సెకండరీ విద్యా స్థాయిలో చదువు మానేసిన వారు (డ్రాపౌట్లు) ఆ తరగతుల్లోని మొత్తం విద్యార్థుల్లో 17 శాతం కాగా, ప్రాథమికోన్నత (68 తరగతులు) స్థాయిలో 1.8 శాతం, ప్రాథమిక స్థాయిలో 1.5 శాతం ఉన్నట్టు వెల్లడైంది. ముందుకు వెళుతున్నకొద్దీ చదువులు మానేస్తున్న వారి శాతం ఎక్కువగా ఉన్నట్టు రూఢి అవుతున్నది. దీనికి ప్రభుత్వం వైపు నుంచి తగిన శ్రద్ధాసక్తులు కొరవడడమే కారణం. దేశంలో పూర్వ ప్రాథమిక నుండి సెకండరీ స్థాయి వరకు 15 లక్షల పాఠశాలలున్నాయి, 97 లక్షల మంది టీచర్లున్నారు. 26.5 కోట్ల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన విద్యా వ్యవస్థ. కాని ఫలితాలు మాత్రం కడుదయనీయం. ఉత్తరాది రాష్ట్రాల్లో విద్యాప్రమాణాలు దారుణంగా పడిపోయాయనే సంగతిని పదేపదే చెప్పుకోనక్కర లేదు. ఉత్తరప్రదేశ్‌లో 3.3 లక్షల టీచర్ పోస్టులు ఖాళీ ఉండగా, బీహార్‌లో 2.21 లక్షల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ కాకుండా ఉన్నాయి. అలాగే బెంగాల్‌లో 1.1 లక్షల అధ్యాపక ఖాళీలు ఏర్పడ్డాయి. ఇన్నిన్ని లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న దేశంలో విద్య వికసిస్తుందని ఆశించలేము. చదువు బాగుంటే చక్కెర చుట్టూ చేరే చీమల బారుల్లా విద్యార్థులు పాఠశాలలకు ఎగబడుతారు. శిథిలమైపోయి భయపెట్టే గోడలు, పై కప్పులు, విరిగిన తలుపులు, దుర్వాసన చిమ్మే టాయ్‌లెట్లు, అసలు మరుగుదొడ్లే లేని, ఉన్నా స్త్రీలకు ప్రత్యేకంగా ఎటువంటి ఏర్పాటూ లేని పాఠశాలలు దేశంలో అసంఖ్యాకంగా ఉన్నాయి. ఇలాంటి పాఠశాలలకు విద్యార్థులు ఎందుకు వస్తారు? దేశంలో దాదాపు 90 నుంచి 95 శాతం పాఠశాలలు మౌలిక సదుపాయాల లేమితో బాధపడుతున్నాయని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనిష్ సిసోడియా ఒక సందర్భంలో అన్నారు. దేశంలోని 84.1 శాతం పాఠశాలల్లో గ్రంథాలయాలున్నప్పటికీ అందులో 69.4 శాతం లైబ్రరీల్లో ఒక్క పుస్తకమూ లేదని నిగ్గు తేలింది.

# బద్వేలులో వార్ వన్ సైడే

కడప, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)2019 ఎన్నికల్లో ఘన విజయం తర్వాత ఏపీలో అధికార పార్టీ వైసీపీ దూకుడు మీద వుంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ ఎన్నికలు జరిగినా.. అక్కడ ఫ్యాన్ గాలి హవా కొనసాగుతూనే వుంది. తాజాగా సీఎం స్వంత జిల్లా కడపలోని బద్వేల్ ఉప ఎన్నిక జరగనుంది. ఈ నెల 30న ఎన్నికల పోలింగ్ నిర్వహించనుంది ఎన్నికల సంఘం. నవంబర్ 2వ తేదీన ఫలితాలు విడుదల కానున్నాయి. బద్వేల్‌లో ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, జనసేనలు పోటీలో లేవు. కానీ, బీజేపీ, ఇండిపెండెంట్లు, మరో పార్టీ కాంగ్రెస్ తన అభ్యర్థుల్ని బరిలో నిలిపింది. ఎలాగైనా తమ సత్తా చాటాలని బీజేపీ, కాంగ్రెస్‌లు ముందుకెళుతున్నాయి. అయితే, గత అనుభవాల దృష్ట్యా ఆయా పార్టీల ప్రభావం అంతగా ఉండదని తేలిపోయింది. గెలుపు పక్కా అని తెలిసినా.. మెజారిటీ గురించే వైసీపీ నేతలు ఆలోచిస్తున్నారు. సీఎం స్వంత జిల్లా కావడంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. పక్కనే వున్న చిత్తూరు నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దగ్గరుండి మరీ ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లను వైసీపీ నేతలు లైట్ తీసుకుంటున్నారు. అక్కడ మాత్రం హడావిడి కొనసాగుతోంది. వైసీపీ, కాంగ్రెస్, బీజేపీలు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నాయి.. మూడు పార్టీల నేతలు అక్కడే మకాం వేశారు. ముఖ్యమంత్రి జగన్ ప్రచారంపై క్లారిటీ వచ్చింది. బద్వేల్ రాలేకపోతున్నానని.. వైసీపీ అభ్యర్థి సుధకు ఓటు వేయాలని ఓటర్లకు ముఖ్యమంత్రి జగన్ లేఖ పంపారు. కరోనా పరిస్థితులు, ఎన్నికల సంఘం నిబంధనలతో తాను బద్వేల్ రాలేకపోతున్నానని భారీ మెజారిటీతో వైసీపీని గెలిపించాలని కోరారు. బద్వేల్ నియోజకవర్గంలోని అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు ఆత్మీయ లేఖ రాశారు. ఉప ఎన్నిక సందర్భంగా తన కుటుంబ సభ్యులైన ఓటర్లతో బద్వేల్ వచ్చి గడపాలని.. ప్రత్యక్షంగా బహిరంగ సభ ద్వారా ఓట్లు అడగాలని భావించాను అన్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో రాలేకపోతున్నానని.. అక్కడికి వచ్చి ఓటు అడగలేకపోతున్నానని లేఖలో ప్రస్తావించారు. తాను అక్కడికి వస్తే.. భారీగా జనాలు ఒక్కసారిగా గుమిగూడితే వారిలో ఏ కొందరికైనా కొవిడ్ వచ్చే ప్రమాదం ఉందని జగన్ అన్నారు. అందరి ఆరోగ్యాలను, ప్రాణాలను, కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని తన పర్యటనను రద్దు చేసుకుంటున్నా అన్నారు జగన్. ఈ పరిస్థితుల్లో తన భావాలను ప్రత్యక్షంగా పంచుకునేందుకు ఈ ఉత్తరం రాస్తున్నాను అన్నారు. లేఖలో నవరత్న పథకాల ద్వారా ఎంతమందికి లబ్ధి చేకూరిందో కుటుంబాల వారీగా వివరించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలుగా ఇంకా మరెన్నో కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ రాసిన ఈ లేఖను ముద్రించి స్థానిక నేతలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు పేరు పేరున స్వయంగా అందిస్తున్నారు. ప్రచార సమయం ముగింపు దశకు చేరుకోనుండడంతో వైసీపీ నేతలు వేగం పెంచారు. గతంలోనూ తిరుపతిలో లోక్ సభ ఉప ఎన్నికల ప్రచారంలో జగన్ పాల్గొన లేదు. ఓటర్లకు లేఖలు రాశారు. గతంలో ఎన్నడూ లేనంతగా అక్కడ భారీ మెజారిటీ వైసీపీ స్వంత మయింది. తిరుపతి లోక్‌సభ ఉపఎన్నికలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గురుమూర్తి భారీ విజయాన్ని నమోదు చేశారు. 2లక్షల 70వేల ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. 2019లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సాధించిన 2లక్షల 28 వేల ఓట్ల మెజార్టీని అధిగమించి గురుమూర్తి ఘన విజయం సాధించారు. మెజారిటీ ఖాయంగా కనిపిస్తోంది. జగన్ రాకపోయినా భారీ మెజారిటీ సాధిస్తామని వైసీపీ నేతలు అంటున్నారు. మొత్తం మీద బద్వేల్ దంగల్‌లో విపక్షాలకు కనీసం డిపాజిట్లు కూడా దక్కే అవకాశం లేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

# తాడేపల్లి నుంచే కంట్రోల్ చేసేశారు

విజయవాడ, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో కేవలం అనుభవం ఉంటేనే సరిపోదు. అధికారంలో వారి వలలో చిక్కకూడదు. అలాగే వారికి దన్నుగానే ఉండాలి. అప్పడే తమకు కావాల్సిన సమయంలో పరిస్థితులు అనుకూలంగా మారిపోతాయి. నలభై ఏళ్ల రాజకీయం అనుభవం తనకు ఉందని చంద్రబాబు చెప్పుకుంటారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పుడు జగన్ బుడ్డిపాలు తాగుతుంటాడాని మొన్నామధ్య 36 గంటల దీక్షలో చంద్రబాబు చెప్పారు. అంటే తనకంటే జగన్ బచ్చా అని చెప్పకనే చెప్పారు. ఆ బచ్చానే ఇప్పుడు చంద్రబాబుకు ఊహించని షాక్ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో ఒంటి చేత్తో చంద్రబాబును చితక్కొట్టిన జగన్, ఇప్పుడు రాజకీయంగా కూడా రాటుదేలిపోయారు. చంద్రబాబు కంటే వ్యూహాల్లో దిట్ట అని నిరూపించుకున్నారు. చంద్రబాబును ఢిల్లీలో గల్లీలకే పరిమితం చేసి కేంద్రం పెద్దల అపాయింట్ మెంట్లు దొరకకుండా చేయడంలో జగన్ వ్యూహం ఉందని అంటున్నారు. జగన్ తాడేపల్లి ఇంట్లోనే ఉండి ఢిల్లీలో చంద్రబాబును కంట్రోల్ చేయగలిగారు. నిజానికి చంద్రబాబుకు గతంలో చేసిన తప్పులే ఇప్పుడు వెంటాడుతున్నాయి. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన బీజేపీతో పొత్తు ఉన్నా కేంద్ర మంత్రి పదవులు తీసుకోకుండా ఉండాల్సింది. దానివల్ల రాష్ట్రానికి వచ్చిన ప్రయోజనం ఏదీ లేదు. అయినా రెండు కీలకమైన మంత్రి పదవులు పొందారు. మూడేళ్ల తర్వాత సాకులు చెప్పి బీజేపీతో ఫ్రెండ్ షిప్ కటీఫ్ చెప్పేశారు. అలాగని ఊరుకున్నారా? మోదీ, అమిత్ షాలపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఢిల్లీ వెళ్లి మరీ కాంగ్రెస్ నేతలను కలసి మోదీని ఓడించాలని పిలుపు నిచ్చారు. కానీ రాజకీయాల్లో తక్కువ అనుభవం ఉన్న జగన్ అలా చేయలేదేతాను అత్యధిక పార్లమెంటు స్థానాలను గెలిచినా కేంద్ర ప్రభుత్వంలో చేరేందుకు జగన్ ప్రయత్నించలేదు. బీజేపీ నేతలు ఆఫర్ ఇచ్చినా సున్నితంగానే తిరస్కరించారంటారు. అంతేకాకుండా బయట నుంచే అంశాల వారీగా మద్దతు ఇస్తున్నారు. బీజేపీతో ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధాలు పెట్టుకోలేదు. బీజేపీ నేతలు కోరినట్లుగానే టీటీడీలో కొందరికి సభ్యులుగా అవకాశం కల్పించారు. ఇలా తన జుట్టును వారి చేతుల్లో పెట్టలేదు. ఫలితంగానే జగన్ జోక్యంతో చంద్రబాబుకు ఢిల్లీలో ఎవరి అపాయింట్ మెంట్ లభించలేదని, బాబు ఢిల్లీ టూర్ ను జగన్ తాడేపల్లి నుంచే అట్టర్ ఫ్లాప్ చేశారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# నెల్లూరు, ప్రకాశంలలో బంగారం ముఠాలు

నెల్లూరు, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)అడవిలో తిరిగే కముజు పిట్టలను పట్టి విక్రయించే ముఠా నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో తిరుగుతోంది. కొందరు యువకులు కముజు పిట్టలను పట్టి విక్రయిస్తామంటూ ఊరూర తిరుగుతూ వ్యవసాయం చేసుకునే కొందరిని టార్గెట్ చేస్తున్నారు. రోజు వారీగా పిట్టలను పట్టి రైతులకివ్వడం వారిని మంచి చేసుకుంటారు. అలా కొందరు అమాయక వ్యక్తులతో మాటలు కలిపి వారితో స్నేహంగా ఉంటారు. స్నేహం ముసుగులో వారి ఫోన్ నంబర్లు సేకరిస్తారు. వారం తర్వాత సారూ.. రాజుల కాలం నాటి బంగారు నగలు తవ్వకాల్లో దొరికాయని, మాకు ఎలా విక్రయించాలో తెలియదని? అవి సగం ధరకే అమ్మిపెట్టమని మొదట కొంత బంగారం నగలు ఇచ్చి నమ్మిస్తారు. వారి మాటలు నమ్మారో అంతే ఫేక్‌బంగారం అంటగట్టి రూ.లక్షల్లో దోచుకుంటారు. ఇలాంటి అంతర్‌జిల్లా కేటుగాళ్లు ప్రస్తుతం నెల్లూరు, ప్రకాశం జిల్లాలో తిరుగుతున్నారు. వారి మాయమాటలు నమ్మి లక్షలు పోగొట్టుకున్న సంఘటనలు ఒక నెలలోనే రెండు వెలుగులోకి వచ్చాయి. రోజువారీగా కముజుపిట్టలను పట్టి పిట్ట మాంసం మంచిదన్న తినండి అంటూ వారిపై ప్రేమ ఒలకపోస్తారు. అలా నమ్మించే ఆ ముఠా సభ్యులు వారం కన్పించకుండాపోయి ఫోన్‌లోనే టచ్‌లో ఉంటారు. ఆపై మెల్లిగా పక్కా ప్లాన్‌తో ఫోన్‌చేసి కర్ణాటక ప్రాంతంలోని మైసూర్ ఏరియాలో మా స్నేహితుడు జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని చెబుతారు. పురాతన భవనం తవ్వుతుంటే రాజుల కాలం నాటి బంగారు ఆభరణాలు దొరికాయని నమ్మబలుకుతారు. బంగారం విక్రయించాలంటే మాకు ఎవరూ తెలియదని? వాటిని విక్రయించిపెడితే అందులో కొంత కమిషన్ ఇస్తామంటూ చెబుతారు. ముందుగా బంగారు ఆభరణాలు ఉన్నాయని, వచ్చి పరిశీలించుకోమని నమ్మిస్తారు. వారి మాటలను నమ్మిన వెళ్లిన వారికి ఫేక్ బంగారం నగలు చూపించి అందులో నాలుగుచోట్ల స్వచ్ఛ బంగారం పూసలు పెట్టి వారి ముందే ఆ పూసలు కట్‌చేసి పరిశీలించుకోమని నమ్మబలుకుతారు. ఆ బంగారు పూసలు తీసుకెళ్లి షాపులో చూపిస్తే మేలిమి బంగారమేనని తేలుతుంది. అంతే సగం ధరకే మేలిమి బంగారు ఆభరణాలు వస్తాయని నమ్మి కేటుగాళ్లకు డబ్బు కట్టి తీసుకుంటారు. ఆపై ఆ ముఠా సభ్యుల ఫోన్ నంబర్ మూగబోతుంది. నగలు ఇంటికి తీసుకెళ్లి మళ్లీ పరిశీలించుకుంటే అది ఫేక్ బంగారం తెలిసిపోయి బాధితులు లబోదిబోమంటున్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలను టార్గెట్ చేసిన ఆ ముఠా సభ్యులు ఒక నెల వ్యవధిలోనే రెండు జిల్లాలో బురిడీ కొట్టించి రూ.లక్షలు దోచుకున్నారు. గత నెలలో సంగం మండల కేంద్రంలో ఇదే తరహాలో నకిలీ బంగారం అంటగట్టి రూ.లక్షలు కొట్టేసిన ఇద్దరు సభ్యులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. సంగంలో కేబుల్ యజమానిని ఇదే తరహాలో బురిడీ కొట్టించి మోసం చేసి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. అలాగే ప్రకాశం జిల్లాకు చెందిన సింగరాయకొండ వాసులకు కూడా మరో ముగ్గురు సభ్యులు బురిడీకొట్టి నకిలీ బంగారం అంటగట్టి దాదాపు రూ.18 లక్షల నగదుతో ఉడాయించారు. అయితే నకిలీ బంగారం లావాదేవీలు కావలి కేంద్రంగా జరగడంతో బాధితులు కావలి పోలీసులను ఆశ్రయించారు. నకిలీ బంగారం ఉచ్చువేసి సొమ్ము చేసుకునే ముఠా సభ్యులు రాయచోటి ప్రాంత వాసులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఆప్రాంతానికిచెందినఓముఠావిడిపోయి జిల్లాల వారీగా తిరుగుతూ ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. వారి నకిలీ బంగారంఉచ్చులోచిక్కుకున్నచాలామందిబయటకుపొక్కితే పరువు పోతుందని చెప్పుకోలేక పోతున్నారు. తాజాగా ఈ రెండు సంఘటనలతో పోలీసులు ఇలాంటి వారి పట్ల జాగ్రతగా ఉండాలని సూచిస్తున్నారు

# టీటీడీలో నేర చరితులా

తిరుపతి, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు నెలలో టీటీడీ పాలకమండలిని నియమించిన విషయం తెలిసిందే. టీటీడీ చైర్మన్‌గా మరోసారి వైవీ సుబ్బారెడ్డికి అవకాశమివ్వడంతోపాటు.. పలువురిని బోర్డు సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో జగన్ ప్రభుత్వానికి హైకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలింది. టీటీడీ బోర్డులో నేర చరిత్ర ఉన్న వారిని సభ్యులుగా నియమించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పాలకమండలి సభ్యులుగా నేర చరిత్ర ఉన్న వారిని నియమించారంటూ జీవోను సవాల్ చేస్తూ బీజేపీ నేత భాను ప్రకాష్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. భాను ప్రకాష్ పిటిషన్‌పై న్యాయవాది అశ్విని కుమార్.. ధర్మాసనానికి వాదనలు వినిపించారు. భారత వైద్య మండలి మాజీ చైర్మన్ కేతన్ దేశాయ్‌ను పాలకమండలి సభ్యుడిగా నియమించడంపై అశ్విని కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే.. ప్రభుత్వం కేతన్ దేశాయిని పాలక మండలి సభ్యుడిగా నియమించడంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వెంటనే ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ టీటీడీ కార్య నిర్వహణాధికారికి నోటీసులు జారీ చేయాలని పేర్కొంది. దీనిపై మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా.. టీటీడీ బోర్డు సభ్యుల నియామకంలో నేర చరిత్ర ఉన్నవారిని నియమించారంటూ గత కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో హైకోర్టు వ్యాఖ్యలతో మరోసారి ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

## కోవాగ్జిన్ కు మళ్లీ కొర్రీలు

హైదరాబాద్, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన కొవాగ్జిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డిఊఏ) అనుమతి మరింత జాప్యం కానుంది. ఎమర్జెన్సీ యూజ్ లిస్టింగ్ (ఈయూఎల్) కోసం ఈ ఏడాది ఏప్రిల్ 19న భారత్ బయోటెక్ డబ్ల్యూహెచ్‌ఓకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఆరు నెలల నుంచి ఏదో ఒక కారణంతో అనుమతిలో జాప్యం జరుగుతోంది. గతంలో పలు కొర్రీలు వేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ.. తాజాగా మంగళవారం జరిగిన సమావేశంలో కొవాగ్జిన్ టీకాకు సంబంధించి భారత్ బయోటెక్‌ను మరింత స్పష్టత కోరింది. డబ్ల్యూహెచ్‌ఓ సాంకేతిక సలహా బృందం (ంఉ) ఈ మేరకు అదనపు వివరాలను కోరింది. భారత్ బయోటెక్ అందజేసే వివరాల ఆధారంగా నవంబరు 3న జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో కొవాగ్జిన్‌ను ఎమర్జెన్సీ యూజ్ లిస్టింగ్‌లో చేర్చడం సమీక్షించినట్టు డబ్ల్యూహెచ్‌ఓ పీటీఐ అడిగి ఓ ప్రశ్నకు ఈ మెయిల్ ద్వారా స్పష్టతనిచ్చిందిఅక్టోబరు 26న సాంకేతిక సలహా బృందం సమావేశమయ్యింది.. కొవాగ్జిన్‌కు సంబంధించి టీకా తయారీదారుల నుంచి అదనపు స్పష్టత కోరింది.

# నల్లారి సెకండ్ ఇన్నింగ్స్

తిరుపతి, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)తెలుగు రాజకీయాల్లో ఆయనది క్రియాశీలక పాత్ర.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి. తెలంగాణ వచ్చిన తరువాత పెద్దగా కనిపించని ఆయన ఇప్పుడు మళ్లీ యాక్టివ్ అవ్వనున్నారా? సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది ఇంతకీ ఎవరాయన? అంటే.. చిత్తూరు జిల్లాలో రాజకీయ ప్రముఖ కుటుంబాలలో ఆయన కుటుంబానికి ప్రత్యేక స్థానం. తండ్రి ఆమర్నాధ్ కి ఉన్న పలుకుబడితో వాయం పాడు, పీలేరు నుండి ఎమ్మెల్యే గా ఎన్నికయ్యారు.



పొలిటికల్ గా ఎదిగారు. చీఫ్ విప్‌గా, స్పీకర్‌గా, ముఖ్యమంత్రిగా తనకంటూ ప్రత్యేక స్థానం ను సంపాదించారు ఆయనే నల్లారి కిరణ్ కుమార్ రెడ్డినల్లారి కిరణ్ కుమార్ రెడ్డి.. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి ..రాష్ట్ర విభజన సమయంలో సర్వ శక్తులు ఒడ్డి విభజన ఆపాలని ప్రయత్నం చేశారు కానీ కాంగ్రెస్ హైకమాండ్ దెబ్బకు సైలెంట్ అయిపోయారు .. సొంతంగా సమైక్యాంధ్ర పార్టీ పెట్టి తిరిగిన సక్సెస్ కాలేకపోయారు అజ్ఞాతంలో కి వెళ్లిపోయారు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే కొంత కాలం తరువాత అయిన మళ్ళీ అక్టీవ్ అవుతున్నారు అన్నా వార్తలు వొచ్చాయి దానికి తగ్గట్టుగానే బీజేపీ సీనియర్ నేతలు ఆయన తో సంప్రధింపులు జరిపారు కానీ తిరిగి మళ్ళీ కాంగ్రెస్ లోనే జాయిన్ అయ్యరు నల్లారి ..అడపదడపా పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్నారు కానీ ఇక్కడ కూడా తన మార్క్ చూపించలేదు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ లో మళ్ళీ క్రియాశీల పాత్ర పోషించే అవకాశం కనిపిస్తుంది కొన్ని రోజుల నుండి ఆయనకు ంజూ పిసిసి పగ్గాలు అప్పజెప్పుతారని వార్తలు వొచ్చిన ఆయన ఆ పదవీ చేపట్టడానికి సుముఖంగా లేరట ..ఏఐసీసీ జనరల్ సెక్రటరీ గాని సిడబ్ల్యుసి మెంబర్ గాని సౌత్ కాంగ్రెస్ ఇంచార్జ్ పదవి గాని ఇవ్వాలని పట్టు బడుతున్నారట ..దీనికి అధిష్టానం కూడా సుముఖత వ్యక్తం చేసి నట్లు తెలుస్తుంది ఢిల్లీ లో సోనియా అధ్యక్షతన జరుతున్న పిసిసి ల మిటింగ్ తరువాత దీని పైన ఒక క్లారిటి వొచ్చే అవకాశం ఉందట.

# కేసీఆర్ కూడా సెటైర్లు ..

విజయవాడ, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)రాష్ట్ర విభజన జరిగాక ఏపీ కంటే తెలంగాణ అన్నీ రంగాల్లో ముందుందని సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు చెబుతూనే వస్తున్నారు. ఆయున రెండోసారి అధికారంలో కొనసాగుతూ?రాష్ట్రాన్ని అన్నీ రంగాల్లో ఫస్ట్ ప్లేస్‌లో ఉంచానని చెప్పుకుంటున్నారు. అయితే కేసీఆర్ ఏం చేశారో చెప్పడానికి?ప్రతిసారి పక్కనే ఉన్న ఏపీతో పోల్చి చెబుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో తెలంగాణ ముందు ఉందని, అలాగే ఏపీలో కంటే తెలంగాణలోనే భూమి ధరలు ఎక్కువగా ఉన్నాయని అనేక సందర్భాలు చెప్పుకొచ్చారు. అంటే ఏపీలో పరిస్తితులు ఎలా ఉన్నాయో చెప్పాల్సిన పని లేదు. తాజాగా టీఆర్ఎస్ ప్లీనరి సభలో కేసీఆర్?ఈ ఏడు ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో బాగా డప్పు కొట్టుకున్నారు. అలాగే తన పాలన అద్భుతంగా ఉందని ఆయనకు ఆయనే కితాబు ఇచ్చుకునే పరిస్తితి. ఇదే సమయంలో ఏపీ పర్ క్యాపిట ఆదాయం లక్షా70వేల కోట్లు, తెలంగాణ పర్ క్యాపిట ఆదాయం 2లక్షల ముప్పై వేల కోట్లు అని, నేడు తెలంగాణలో 24 గంటల కరెంట్, ఏపీలో కరెంట్ కోతలు ఉన్నాయని మాట్లాడారు. ఇక ఎక్కడి తెలంగాణ, ఎక్కడి ఏపీ.. అసలు ఇప్పుడు రెండు రాష్ట్రాలకు పొంతనే లేదంటూ?.తనదైన శైలిలో ఏపీపై కౌంటర్లు వేసేశారు. అంటే పక్క రాష్ట్రం సీఎం సైతం కామెంట్ చేసేలా ఏపీలో పరిస్తితులు ఉన్నాయా? అంటే కాదని చెప్పలేమనే ఇక్కడి రాజకీయ వర్గాల నుంచి సమాధానం వస్తోంది. ఎందుకంటే ఆదాయం ఎలాగో పడిపోయింది?అప్పులే మీద ఏపీలో బండి నడుస్తుందని చెప్పాల్సిన పని లేదు. అయితే ఇంతవరకు ఏపీలో కరెంట్ కోతలు లేవు..కానీ ఇటీవల అనూహ్యంగా కరెంట్ కోతలు పెరిగాయి. ఎలాగో కరెంట్ చార్జీల బాదుడు ఓ రేంజ్‌లో ఉన్నాయి. దానికి తోడు కోతలు కూడా?ప్రభుత్వ అధికారులు కోతలు ఉండవని చెబుతారు?కానీ అనధికార కోతలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కరెంట్ కోతలు ఉంటున్నాయి. అందుకే అనుకుంటా తెలంగాణ సీఎం కేసీఆర్ సైతం కామెంట్ చేసేలా ఏపీలో పరిస్తితులు ఉన్నట్లున్నాయి.

## ఎమ్మెల్యే ఇంటిముందు పోలీసుల మోహరింపు

విశాఖపట్నం అక్టోబరు 27, (న్యూస్ పల్స్‌విశాఖ తూర్పు నియోజక వర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఇంటి వద్ద కొంత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. హరిత రిసార్ట్స్ కూల్చివేత, రుషి కొండ తవ్వేయడం ని ప్రజలకు తెలియజేసే ఉద్దేశ్యం తో నిరసన కార్యక్రమానికి టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. అయితే నిరసనలు అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు లో భాగంగా ఎమ్మెల్యే ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. ఎమ్మెల్యే ని హౌస్ అరెస్టు చేశారు. దీనితో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఇంటి కి చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగం అమలు కావడం లేదని, రాజారెడ్డి పాలన నడుస్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టేశారని గుర్తు చేశారు. రుషికొండ దగ్గర జరిగే విషయాన్ని ప్రజలకు తెలియజేసే ఉద్దేశ్యం తో బయటకు వెళ్ళుతుంటే ఎమ్మెల్యే అయిన తనను అడ్డుకోవడం దారుణమన్నారు.

## కొనసాగుతున్న రేషన్ డీలర్ల సమ్మె

విజయవాడ, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ డీలర్ల ఆందోళనలు కొనసాగుతున్నాయ్. జీవో నెంబర్ టెన్ రద్దు కోసం పోరుబాట పట్టారు. స్టేట్ వైడ్‌గా రేషన్ దిగుమతిని, పంపిణీని నిలిపివేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించేవరకు తమ ఆందోళనలు కొనసాగుతాయంటున్నారు. రేషన్ డీలర్ల డిమాండ్లలో గన్నీ సంచులు ఒకటి. గన్నీ సంచుల్లో డీలర్లకు సరుకుల సప్లై జరుగుతుంది. ఈ గన్నీ సంచుల్ని డీలర్లే అమ్ముకునేవారు. ఎంతోకొంత ఆదాయం వచ్చేది. ఇప్పుడీ గన్నీ సంచుల్ని ప్రభుత్వమే తీసేసుకుంటోంది. దాంతో ఆర్థికంగా మరింత నష్టపోతున్నామని డీలర్లు అంటున్నారు. కనీసం నిర్వహణ ఖర్చులు కూడా రాకపోతే రేషన్ షాపుల్ని ఎలా నడపాలని డీలర్లు ప్రశ్నిస్తున్నారు. అలాగే, ఏళ్లతరబడి పేరుకుపోయిన ఎండీఎం, ఐసీడీఎస్ బకాయిల్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. డీడీ నగదు వాపస్, ప్రైస్ డిఫరెన్స్ సర్క్యులర్ అమలు చేయాలంటున్నారు. డీలర్‌లకు ఏవైనా సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి.. అంతేకాని బెదిరిస్తే భయపడేది లేదంటూ సివిల్ సప్లై మినిస్టర్ కొడాలి నాని వార్నింగ్ ఇచ్చారు.

# బెజవాడలో పార్కింగ్ కష్టాలు

విజయవాడ, అక్టోబరు 27, (న్యూస్ పల్స్) విజయవాడలో వాహనదారులకు పార్కింగ్ ఆందోళనకర సమస్యగా మారింది. సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో బిజీగా ఉన్న రోడ్లకు ఇరువైపులా పార్కింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరంలోని మహాత్మాగాంధీ రోడ్, కార్ల్‌మార్క్స్ రోడ్, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, టికిల్ రోడ్ సహా ప్రధాన రహదారులు ప్రతిరోజూ రద్దీగా ఉంటాయి. ముఖ్యంగా గవర్నర్‌పేట, బీసెంట్ రోడ్, నక్కల్ రోడ్, సూర్యారావుపేట, కస్తూరీబాయ్‌పేటతోపాటు ఇతర వాణిజ్య ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా అనధికార పార్కింగ్ వల్ల పాదాచారులు సైతం రహదారులపై నడవలేని పరిస్థితి నెలకొంది. నగరం రాజధాని ప్రాంతంలో భాగమయ్యాక జనాభా భారీగా పెరిగింది. 2011లో పది లక్షలు ఉన్న జనాభా ప్రస్తుతం 19 లక్షలకు చేకుందని అంచనా. వాహనాల సంఖ్య సైతం రెట్టింపైంది. ప్రస్తుతం విజయవాడలో మొత్తం 6,87,088 వాహనాలు ఉన్నాయి. ట్రాన్స్‌పోర్టు వాహనాలు 90,837 కాగా.. నాన్ ట్రాన్స్‌పోర్టు 5,96,251 ఉన్నాయి. అయితే రహదారులు మాత్రం ఇరుకిరుకుగానే ఉన్నాయి. ప్రధాన రహదారుల్లో ఉన్న వాణిజ్య భవనాల్లో 90 శాతం వాటికి పార్కింగ్ సౌకర్యాలు లేవు. నగరంలోని అత్యధిక శాతం షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో పార్కింగ్ సదుపాయాలు లేవు. దీంతో షాపింగ్ కాంప్లెక్స్‌లకు వెళ్లే వాహనదారులు రహదారులపైనే తమ వాహనాలు పార్కు చేసి వెళ్తున్నారు. చాలా వరకు షాపింగ్ కాంప్లెక్స్‌లు సెల్లార్లను స్టాక్‌యార్డులుగా వినియోగిస్తున్నారు. కొన్ని చోట్ల వాహనాలను రహదారులపైనే పార్కింగ్ చేయాలని కోరుతుండటం గమనార్హం. మరికొన్ని చోట్ల పార్కింగ్ ఫీజులు అధిక మొత్తంలో షాపింగ్ కాంప్లెక్స్‌ల యాజమాన్యాలు వసూలు చేస్తుండటంతో వాహనదారులు రోడ్లపైనే తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నగరపాలక సంస్థ అధికారులు 18 సముదాయాల్లో పార్కింగ్ ప్రదేశాల్లో నిర్మించిన కట్టడాలను తొలగించారు. 59 వాణిజ్య భవనాలకు నోటీసులు జారీ చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. నగరంలో విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు చిత్తూరి కాంప్లెక్స్, కాళేశ్వరరావు మార్కెట్, ఎన్టీఆర్ కాంప్లెక్స్‌ల్లో స్మార్ట్ పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అలాగే ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డుల్లోనూ అలాంటి పార్కింగ్ కేంద్రాలను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి తరువాత దానిని విస్మరించింది. అలాగే నగరంలో బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను అధికారులు అటకెక్కించడంతో అవి కలగానే మిగిలిపోయాయి. కృష్ణా జిల్లా రహదారి భద్రతా సలహా కమిటీ నగరంలో పార్కింగ్ సమస్యపై దృష్టి సారించింది. నగరంలో వాణిజ్య ప్రాంతాల్లో పార్కింగ్ సముదాయాలను నిర్మించాలని వీఎంసీ అధికారులకు సూచించింది. ఇదీ ప్రతిపాదనగానే మిగిలిపోయింది. వీధుల్లో అనధికార పార్కింగ్‌పై చర్యలు తీసుకోవడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమయ్యారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు అనధికారికంగా పార్కింగ్ చేసిన వాహనదారులపై 16వేల కేసులు నమోదు చేశారు. అయినా నేటికీ ప్రధాన రహదారులు, జంక్షన్లలో వాహనాల పార్కింగ్ కొనసాగుతూనే ఉంది. బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు నగరంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని బీసెంట్ రోడ్డు, వన్‌టౌన్ ప్రాంతాల్లో నిర్మించాలని నిర్ణయించాం. అయితే వన్‌టౌన్ ప్రాంతంలో వీఎంసీకి చెందిన స్థలం లేదు. ప్రైవేటు భూమి సేకరించాల్సి ఉంది. బీసెంట్ రోడ్డులో నిర్మించే భవనానికి దాదాపు రూ. 5 కోట్లకు పైగా వ్యయం అవుతుంది

## జనసేన, టీడీపీ పొత్తు వికసించేనా

గుంటూరు, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)ఆయనకు క్రెడిబులిటీ లేదు. ఈయనకు అకౌంట్ బులిటీ లేదు. ఇద్దరినీ జనం నమ్ముతారా? అన్నదే ప్రశ్న. ఏపీలో ఇప్పుడు ఎక్కడ చూసినా జనసేన, టీడీపీ పొత్తు గురించే. అసలు పొత్తు కుదురుతుందా? లేదా? పక్కన పెడితే ఆ పార్టీ నేతల నుంచి ప్రత్యర్థి పార్టీల నేతలు ఆ పొత్తు కారణంగా ఎవరిది గెలుపన్న లెక్కల్లో మునిగిపోయారు. ప్రతి నియోజకవర్గంలో ఇదే పరిస్థితి. కోస్తాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉంది. అయితే ఇద్దరు నేతలు కలసి ప్రచారానికి వస్తే ప్రజలు ఆదరిస్తారా? అన్నది కూడా చర్చనీయాంశ మైంది. చంద్రబాబు సుదీర్ఘకాలం ఏపీని పాలించారు. ఆయన ఎటువంటి వారో అందరికీ తెలుసు. ఇచ్చిన హామీని అమలు చేయని పరిస్థితి చంద్రబాబుది. అదే సమయంలో ఉన్న పథకాలను తొలగించే అవకాశం ఉంది. చంద్రబాబు గతంలోనూ ఇదే విధానాన్ని అమలు చేశారు. చంద్రబాబు తాను చేయదలచుకున్న పనులను చెప్పినా ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. ఇక పవన్ కల్యాణ్. జనసేన పార్టీ స్థాపించిన తర్వాత అనేక పార్టీలకు మద్దతుగా నిలిచారు. తాను లేకుంటే అవతలి పార్టీ లేదనుకునే మనస్తత్వం ఈయనది. తానొక్కడే క్లీన్ ఇమేజ్ ఉన్నేవాడినని, అవతలి వాళు అవినీతి పరులని భావించే మనస్తత్వం ఆయనది. నిలకడలేని స్వభావం ఉన్న పవన్ కల్యాణ్ ను ప్రజలు ఈసారి కూడా నమ్మే పరిస్థితి ఉంటుందా? అన్నదే సందేహం. ప్రతి ఎన్నికకు జెండాను మార్చే పవన్ కల్యాణ? వెంట జనం నడిచే అవకాశం లేదన్నది కొందరి వాదన. చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు ఇద్దరూ కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసినా ఫలితాల్లో పెద్దగా మార్పు ఉండబోవన్నది వైసీపీ నేతల అంచనా. మహాఅయితే ఒక పది నియోజకవర్గాల్లో ఈ ప్రభావం ఉంటుందని, వాటిని గుర్తించి జగన్ ఆ నియోజకవర్గాల్లో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటారని చెబుతున్నారు. మొత్తం మీద టీడీపీ, జనసేన పొత్తు ఏపీలో హాట్ టాపిక్ గా మారింది. అనేక చోట్ల రెండు పార్టీల గుర్తులు, అధినేతల ఫొటోలతో ఫ్లెక్సీలు కూడా వెలిశాయి

## ఆటో బోల్తా? ఇద్దరు మృతి

### ఒకరి పరిస్థితి విషమం

అనంతపురం అక్టోబరు 27, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండ లం 75 వీరాపురం తండా సమీపంలో ఆటో బోల్తా పడి ఇద్దరు మహిళలు సం ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం గుమ్మగట్ట మండలం 75 వీరాపురం తాండ సమీపంలో 75 వీరాపురం నుంచి రాయదుర్గం వైపు ప్రయాణికులతో ఆటో వస్తుండగా పొలంలో మేత మేస్తున్న ఆవు రోడ్డుకు అడ్డంగా వచ్చింది. ఆవును తప్పించబో యి ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిం ది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కేపీ దొడ్డి గ్రామానికి చెందిన శివమ్మ 75 వీరాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి లు దుర్మరణం చెందారు. అదేవిధంగా మరో మహిళ గొల్ల నాగమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమి త్తం బళ్ళారి విమ్సకు తరలించారు. ఆటోడ్రైవర్ మహేష్ తో పాటు ఇద్దరు చిన్నారులు స్వల్ప గాయాలతో బయ టపడ్డారు. గుమ్మగట్ట ఎస్సై తిప్పయ్య నాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వాల్తేరు డివిజన్ పై కష్టాలు

విశాఖపట్టణం, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)విశాఖ కేంద్రంగా ఉన్న వాల్తేరు రైల్వే డివిజన్‌ను కేంద్రంలోని ప్రభుత్వం ఎత్తివేయడమే కాకుండా, ఈ డివిజన్ పరిధిలోని పలు రైలు ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. వాల్తేరు పరిధిలో సర్వే పూర్తయి ఏళ్లు గడుస్తున్నా కీలకమైన థర్డ్ లైన్, డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ పనుల విషయంలో తీవ్ర తాత్సారం చేస్తోందిదేశంలోనే కీలకమైన రైల్వే కేంద్రం వాల్తేరు (విశాఖపట్నం). ప్రతి రోజూ 120 రైళ్లు ఈ మహానగరం మీదుగా దేశంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. కోవిడ్-19 వచ్చాక ప్రస్తుతం 90 రైళ్లు నడుస్తున్నాయి. రైళ్ల రద్దీ కారణంగా విశాఖపట్నం అవుటర్‌లో వాటిని నిలిపేయడం, ట్రాఫిక్ డైవర్షన్ నిత్యకృత్యమైంది. రైలు లైన్ల పనుల్లో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే ఇందుకు కారణం. గోపాలపట్నం-విశాఖపట్నం ఎనిమిది కిలోమీటర్ల థర్డ్ లైన్ కోసం 2015లోనే సర్వే పూర్తయినా నేటికీ నిధులు విడుదల చేయలేదు. అప్పట్లో రూ.106 కోట్లు అంచనా వేయగా, జాప్యం కారణంగా ఇప్పుడు నిర్మాణ వ్యయం రూ.160 కోట్లకు పెరిగింది. ఈ లైను పూర్తి కానందున విశాఖపట్నం జంక్షన్‌కు సమీపాన రైళ్లను గంటల కొద్దీ నిలిపేయాల్సి వస్తోంది. కంచరపాలెం, గోపాలపట్నం, అనకాపల్లి, దువ్వాడ వద్ద ఇది నిత్యకృత్యంగా మారిపోయింది. విజయనగరం-పలాస (బైపాస్ లైన్) సర్వే పూర్తయింది. రూ.1200 కోట్లు అంచనా వ్యయంతో రూపొందించబడిన థర్డ్ లైన్ పనులకు మోక్షం కలగడం లేదు. పాత రైలు ప్రాజెక్టు గోపాలపట్నం-విజయనగరం థర్డ్ లైన్ ఒక్కటే 2014 నుంచి 2021 వరకూ బిజెపి పాలనలో పూర్తయింది. విజయనగరం-టిట్లాగర్ 3వ లైనుకు క్లియరెన్స్ ఇవ్వలేదు. కెకెలైన్ డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్ రూ.7 వేల కోట్లతో 470 కిలోమీటర్లు జరగాల్సిన ప్రాజెక్టుకు కేంద్ర రైల్వే బోర్డు అనుమతి ఇవ్వలేదు. రూ.1,200 కోట్లతో రాయగడ-కోరాపుట్ 170 కిలోమీటర్ల డబ్లింగ్ పనులకు అతీగతీ లేదు. రైల్వే చరిత్రలో ఏటా రూ.6,500 కోట్లు టర్నోవర్ సాధించడంలోనూ, రైలు ట్రాఫిక్‌లోనూ కీలకమైన వాల్తేరు రైల్వే డివిజన్ ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పరిధిలో విస్తరించి ఉంది. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళంలోపాటు ఒడిశాలోని కోరాపుట్, రాయగడ, గజపతి జిల్లాలు, ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, దంతేవాడ కూడా దీని పరిధిలోనే ఉన్నాయి. వాల్తేరు రైల్వే డివిజన్‌ఉసురు తీసిన బిజెపి ప్రభుత్వం, దీని పరిధిలోని పలు ప్రాజెక్టులను చేపట్టకుండా ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేస్తుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## కిలో టమోటా 55 రూపాయలు



పత్తికొండ అక్టోబరు 27, (న్యూస్ పల్స్) వ్యవసాయ మార్కెట్లో కిలో టమోటా 55 రూపాయల ధర పలికింది. నెల రోజుల క్రితమే టమోటాకు సరైన ధరలు లేక, మార్కెట్‌లో కొనే వారు లేక రోడ్డు పక్కనే పడేసిన దృశ్యాలు కూడా కనిపించాయి. వీటిని చూసిన సగటు వ్యక్తులు అయ్యో పాపం అన్నారు. కొంత మంది రైతులు అయితే.. పంట కూడా తీయకుండా పొలంలోనే వదిలేశారు. తీస్తే కూలీలు మీద పడుతాయన్న భయంతో అలానే వదిలేశారు. అలాంటిది.. గత వారం పత్తికొండ పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా టమోటా పంట నష్టపోతుంది . పంట దిగుబడి పూర్తిగా తగ్గి పోవడం వల్ల, ఏర్పడ్డ పరిస్థితులో మంచి ధరలు వస్తున్నాయి. మార్కెట్‌కు సరుకు తీసుకొచ్చిన రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంచి లాభాలు వస్తున్నాయని సంతోష పడుతున్నారు. ఇలాంటి ధరలు ఏడాది పొడవునా ఉండాలని రైతులు కోరుకుంటున్నారు. మనము ధరలు పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు అంచనా వేస్తున్నారు.

## ఆఫ్ఘనిస్తాన్‌లోనే ఇంకా 450 మంది అమెరికన్లు.. పెంటగాన్ వెల్లడి



వాషింగ్టన్ : అమెరికా పౌరులు ఇంకా దాదాపు 450 మంది ఆఫ్ఘనిస్తాన్‌లోనే ఉండిపోయారు. వారి గురించి పెంటగాన్ ఆందోళన చెందుతున్నది. భద్రతా దళాలు ఉపసంహరించుకున్న దాదాపు రెండు నెలల తర్వాత ఇంకా 450 మంది వరకు అమెరికన్ పౌరులు ఆఫ్ఘనిస్తాన్‌లో ఉండిపోయారని పెంటగాన్ అంచనా వేసింది. వీరంతా ఆ దేశాన్ని విడిచిపెట్టాలనుకుంటున్నారని అమెరికా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమాచారాన్ని సెనేట్‌లో పెంటగాన్ బహిరంగపరిచింది. ఆఫ్ఘనిస్తాన్‌లో ఉండిపోయిన వారిలో చాలా మందితో అమెరికా సంప్రదింపులు జరుపుతున్నదని కూడా వెల్లడించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్న 363 మంది అమెరికన్లతో అధికారి సంప్రదింపులు జరుపుతున్నట్లు అమెరికా అండర్ సెక్రటరీ ఆఫ్ డిఫెన్స్ కోలిన్ ఖాల్ తెలిపారు. వీరిలో దాదాపు 176 మంది అమెరికన్లు ఆఫ్ఘనిస్తాన్ నుంచి బయటకు రావాలనుకుంటున్నారని ఖామా ప్రెస్ రిపోర్ట్ పేర్కొన్నది. ఆఫ్ఘనిస్తాన్‌లో చిక్కుకున్నప్పటికీ ఆ దేశం విడిచిపెట్టడానికి ఇష్టపడనివారు లేదా అమెరికా రావడానికి సిద్ధంగా లేనివారు దాదాపు 243 మంది అమెరికన్లు ఉన్నారు. 200 మందికి మించి అమెరికన్లు ఆఫ్ఘనిస్తాన్‌లో లేరని జో బైడెన్ ప్రభుత్వం ఇంతకుముందు వెల్లడించింది. భద్రతా బలగాలను ఉపసంహరించుకున్న తర్వాత ఆఫ్ఘాన్‌లోని తాలిబాన్‌తో అమెరికాకు ప్రత్యక్ష సంభాషణలు ఇంతవరకు జరుగలేదు. ఇటీవలి మాస్కో ఫార్మాట్‌లో కూడా అమెరికా పాల్గొనలేదు. ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్న తమ దేశ పౌరులను తరలించేందుకు అమెరికా పాకిస్తాన్, ఇరాన్, ఖతార్ దేశాల సాయం తీసుకునేందుకు సిద్ధమైనట్లుగా తెలుస్తున్నది.

## దంపతుల ఆత్మహత్య

రామచంద్రపురం అక్టోబరు 27, (న్యూస్ పల్స్)తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం నియోజక వర్గం కాజులూరు మండలం కాజులూరు పంచాయతీ పరిధిలో అగ్నికులక్షత్రీయుల పేటకు చెందిన రేకాడి పాపారావు రేకాడి పూసలమ్మ అనే దంపతులు బుధవారం తెల్లవారు జామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు..అప్పుల బాధ తాకలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది..విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి గ్రామ ఉప సర్పంచి దండంగి చిన్నారావు చేరుకున్నారు. మృతుల కుటుంభీకులను ఓదార్చారు..రెవెన్యూ వార్కి పోలీసు వార్కి సమాచారం అందించారు..కాకినాడ రూరల్ సి.ఐ మురళీ కృష్ణ...గొల్లపాలెం ఎస్ ఐ పవన్ కుమార్ లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కాజులూరు పంచాయతీ పరిధిలో గల అగ్నికుల క్షత్రీయుల పేటలో మత్స్య కారులు అధికంగా నివసిస్తున్నారు..వీరిలో ఒకరైన రేకాడి పాపారావు...పూసలమ్మ దంపతులు కూడా నిత్యం చేపలను వేటాడుతూ జీవిస్తున్నారు. పూసలమ్మ ప్రతీ రోజూ మార్కెట్టులో చేపలను విక్రయిస్తూ ఉంటారు..గ్రామంలో అందరితో మంచిగా పోతున్న వీరు అప్పుల భారిన పడ్డారు..దీంతో బుధవారం వేకువ జామున వారి నివాసంలోనే ఉరి వేసుకుని మృతి చెందారు..విషయం తెలియడంతో గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉప సర్పంచి దండంగి చిన్నారావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు..అక్కడి మృతుడి కుటుంబీకులకు తగు సహాయ చర్యలు అందించారు. మంత్రి వేణు గోపాలకృష్ణకు ఫోన్లో సమాచారం అందించారు..కాకినాడ రూరల్ సి.ఐ మురళీ కృష్ణ...గొల్లపాలెం ఎస్ ఐ పవన్ కుమార్ లు శాఖా పరమైన చర్యలు తీసుకున్నారు..ప్రభుత్వ పరంగా వార్కి అందాల్సిన రాయితీలు అందించాలని మంత్రి వేణు గోపాలకృష్ణ ఆదేశాలు జారీచేశారు

## ధూళిపాళ్ల ట్రస్టుపై నోటీసులు

అమరావతి అక్టోబరు 27, (న్యూస్ పల్స్) టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రపై ప్రభుత్వం మరో అస్త్రం ఉపయోగించింది. ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ను స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు జారీ చేసింది. సహకార చట్టంలోని 6ఏ సెక్షన్ కింద ట్రస్టును స్వాధీనం ఎందుకు చేసుకోకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చారు. దేవాదాయ శాఖ కమిషనర్ హరి జవహర్లాల్ నోటీసులు జారీ చేసారు. వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. డీవీసీ ట్రస్టు ద్వారా డీవీసీ ఆస్పత్రి నడుస్తోన్న విషయం తెలిసిందే. పాల రైతుల కుటుంబ సభ్యులకు 50శాతం రాయితీతో వైద్యం అందిస్తూ డీవీసీ ఆస్పత్రి పేరుగాంచింది.

## నిరసన ర్యాలీ కార్యక్రమానికి పూర్తి మద్దతు తెలిపిన తెలుగుదేశం

విశాఖపట్నం అక్టోబరు 27, (న్యూస్ పల్స్) ఆదివాసీ ఉప తెగలైన వాల్మికి,భగత,కులాలను ప్రభుత్వ వెబ్సైట్ నుండి తొలగించడం తో పాడేరులో నిర్వహించిన నిరసన ర్యాలీ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ పూర్తి మద్దతుగా నిలబడింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ ఆదివాసుల అమాయకత్వాన్ని చూసి ప్రభుత్వం ఆదివాసులని తొక్కేయడానికి ప్రయత్నాలు చేస్తుందని దాని కారణంగానే ఈ రోజు వాల్మీకి, భగత కులాలను ప్రభుత్వ వెబ్సైట్ నుండి తొలగించారని. దీని. వలన ప్రభుత్వం ఆదివాసులపట్ల ఎంత కక్షసాధిస్తుందో తెలుస్తోంది అన్నారు. గిరిజనుల పట్ల ఇంత అన్యాయం జరిగుతుంటే గిరిజన ప్రజాప్రతినిధులు మౌనంగా ఉంటడంవెనక కరణాలేంటో త్వరలోనే ప్రజలు తెలుసు కుంటారన్నారు. మాజీమంత్రి కిడారి మాట్లాడుతూ.. ఈ రోజు వాల్మికి ,భగత కులాలకు తొలగించారు ఇలా వదిలేస్తే అన్ని కులాలను ఇలాగే తొలగిస్తారని దీని వలన ఆదివాసును పూర్తిగా ప్రభిత్వం అన్యాయం చేస్తుందన్నారు. అలా జరగకుండా తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తుందన్నారు. అవరమయితే ప్రాణాలు పణంగా పెట్టి అయిన మా హక్కులు కాపాడుకుంటామన్నారు. అంతవరకు ప్రజల పక్షాన తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీమంత్రి కిడారి శ్రావణ్ కుమార్, సివేరి అబ్రహం, పాంగి పాండురంగ స్వామి, బాకురు వెంకటరమణ, దొన్నుదొర తెలుగుదేశం పార్టీ శ్రేణులు వందల సంఖ్యలో పాల్గున్నారు.

## అమరీందర్ కొత్త పార్టీ

ఛండీఘడ్, అక్టోబరు 27, (న్యూస్ పల్స్)పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆ రాష్ట్రంలో మరో కొత్త పార్టీ ఏర్పాటు కావడం ఖాయమయ్యింది. త్వరలోనే కొత్త పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ బుధవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ప్రకటించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం లభించిన తర్వాత తమ పార్టీ పేరు, చిహ్నంను ప్రకటించనున్నట్లు తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నవ్‌జోత్ సింగ్ సిద్ధు ఎక్కడి నుంచి పోటీ చేసినా.. తాము కూడా అక్కడి నుంచి పోటీ చేస్తామని స్పష్టంచేశారు. తన కొత్త పార్టీలో చేరేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన చాలా మంది సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని మొత్తం 117 స్థానాల్లోనూ తాము పోటీచేస్తామని అమరీందర్ సింగ్ స్పష్టంచేశారు. సీట్ల సర్దుబాట్లు ఉండే అవకాశముందని.. లేని పక్షంలో తమ పార్టీ అన్ని స్థానాల్లోనూ ఒంటరిగా బరిలోకి దిగుతుందని చెప్పారు. అదే సమయంలో బీజేపీ, ఇతర చిన్న పార్టీలతో పొత్తులకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించేందుకు ఐక్య కూటమిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తానని వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులకు సంబంధించి ఇతర పార్టీలతో చర్చలు జరగాల్సి ఉందని తెలిపారు. వ్యవసాయ చట్టాల వివాదంపై చర్చించేందుకు గురువారంనాడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలవనున్నట్లు వెల్లడించారు. తన వెంట 25-30 మందిని తీసుకెళ్లి అమిత్ షాతో కలుస్తానని తెలిపారు. సిద్ధూకు ఏమీ తెలీదు.. నోటికొచ్చింది మాట్లాడటమే అతనికి తెలుసంటూ అమరీందర్ సింగ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు పలువురు కేంద్ర మంత్రులను కూడా కలవనున్నట్లు తెలిపారు. కేంద్రంతో కలిసి పనిచేయకపోతే రాష్ట్రం పెద్దగా చేయగలిగింది ఏమీ ఉండదని అభిప్రాయపడ్డారు. సుపరిపాలన అంటే ఏంటో సిద్ధూకు తెలుసని తాను భావించడంలేదన్నారు. సిద్ధూ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచే పార్టీ ప్రతిష్ట రోజురోజుకూ దిగజారుతూ వచ్చిందన్నారు.

## రెండు కోట్ల గంజాయి స్వాధీనం

చింతూరు అక్టోబరు 27, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం వద్ద భారీగా గంజాయి దొరికింది. రెండు కోట్ల విలువైన గంజాయి ని చింతూరు మోతుగూడెం పోలీసులు పట్టుకున్నారు. ఐషర్ వ్యాన్ లో కొబ్బరికాయ ల లోడు లో గంజాయ్ మూటలను దాచి నిందితులు తరలిస్తున్నారు.

సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా 2000 వేల కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయి తో పాటు ఒక కారు వ్యానును స్వాదీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితుల్లో ఇద్దరు తెలంగాణ రాష్ట్రం కి చెందిన వారు ఒక వ్యక్తి ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వాడు గా తెలిపారు.. పట్టుబడ్డ గంజాయి విలువ 2కోట్లు ఉంటుందని చింతూరు ఎఎస్పీ కృష్ణ కాంత్ తెలిపారు.

## దేశాభివృద్ధికి అవినీతే అడ్డంకి

### - టీటీడీ సీవీఎస్వో గోపీనాథ్ జెట్టి

తిరుపతి,మా ప్రతినిధి,అక్టోబర్ 27, దేశం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వాలు చేస్తున్న కృషి కి అవినీతి అడ్డంకిగా మారిందని టిటిడి సివిఎస్వో గోపీనాథ్ జెట్టి అన్నారు. అవినీతిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు వారి స్థాయిలో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పిలుపుమేరకు మంగళవారం ప్రారంభమైన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం టిటిడి పరిపాలనా భవనం నుంచి అలిపిరి టోల్ గేట్ వరకు వాక థాన్ ర్యాలీ నిర్వహించారు. గోపీనాథ్ జెట్టి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం అలిపిరి టోల్ గేట్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిటిడి లో భక్తులకు దర్శనం, వసతి, ప్రసాదాల పంపిణీ విషయాల్లో ఎక్కడైనా అవినీతి జరిగితే భక్తులు అధికారులకు తెలియజేయాలన్నారు. భక్తులకు అవినీతి రహిత సేవలు అందేలా విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. నవంబర్ ఒకటవ తేదీ స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఈ వారోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు. విజిలెన్స్ అధికారులు, సిబ్బంది చేత అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అదనపు సివిఎస్వో శివ కుమార్ రెడ్డి, విజీవోలు బాలి రెడ్డి, మనోహర్, ఏవిఎస్వో లు సాయి గిరిధర్, కళావతి పాల్గొన్నారు.

## సన్నబియ్యం హామీలు మర్చిపోయిన ప్రభుత్వం

### మల్లెల లింగారెడ్డి

కడప రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మంది రేషన్ డీలర్స్ సమస్యల ప్రభుత్వం పరిశీలించలేదని సివిల్ సప్లై గోడౌన్ బీగాలు వేయడం జరిగింది రాష్ట్రంలో 50 సంవత్సరాల నుండి రేషన్ డీలర్లను పనిచేస్తున్నారని రేషన్ డీలర్స్ ఆదాయం కోల్పోయి రోడ్డు పై పడే పరిస్థితి ఏర్పడిందని కడప పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేషన్ సరుకులు వాహనాల ద్వారా డోర్లు చేస్తామంటూ వాహనాలను కొనుగోలు చేసి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారులు ఇంటి వద్ద లేక సమయానికి డబ్బు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సన్నబియ్యం అందిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే సన్నబియ్యం హామీలు మర్చిపోయి మంత్రులు బూతుపురాణం మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వము రేషన్ షాపులో కందిపప్పు 27 రూపాయలు ఉండగా 65 రూపాయలకు పెంచి చెక్కర 10 రూపాయలు నుండి 17 రూపాయలు పెంచి రాష్ట్ర వ్యాప్తంగా 627 కోట్ల రూపాయలు ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని అన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం లబ్ధిదారునికి మాత్రమే వేలిముద్ర వేసి సరుకులు ఇవ్వాలని లబ్ధిదారులు వేలిముద్ర పడుకుంటే విఆర్ఓ ద్వారా వేలిముద్ర వేసి బియ్యం పంపిణీ చేయాలని అన్నారు. ఇప్పుడు అలా కాకుండా వాల్ ఎంట్రీ ద్వారా వేలి ముద్రలు వేయడం వలన వలస కూలీలు లేని సమయంలో వాల్ ఎంట్రీలు రేషన్ బియ్యాన్ని స్వాహా చేస్తున్నారని అన్నారు.

# అమరవీరుడు ధనుంజయ్ కు ఘన నివాళులు

## అమరవీరునికి నివాళులర్పించిన ఎస్.ఐ. పాఠశాల యందు చెట్లను నాటి, బహుమతులు ప్రధానం చేసిన ఎస్.ఐ



తుగ్గలి అక్టోబరు 27, ( విభారె) తుగ్గలి మండల పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు పోలీసు అమరవీరుల దినోత్సవంపై విద్యార్థులకు తుగ్గలి ఎస్.ఐ షామీర్ భాష అవగాహన కల్పించారు. బుధవారం రోజున అమరవీరుల దినోత్సవం పై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మరియు ఎస్సై లు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటి,చెట్లను పరిరక్షించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిధిలోని మారెళ్ళ గ్రామంలో 2000 సంవత్సరంలో జరిగిన కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సిఆర్పిఎఫ్ జవాన్ ధనుంజయ్ కు ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వీర జవాన్ ధనుంజయ్ తల్లి వీర మాతకు ఫలహారాలను అందజేసి ఆమెను అభినందించారు.అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఎంతోమంది వీర జవానులు దేశం కోసం ప్రాణాలర్పించారని, వారిని కన్న మాతృమూర్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. దేశాల కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ లను ఎన్నడు మరవకుండా వారిని మననం చేసుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెండేకల్లు ఆర్.ఎస్ పాఠశాల సిబ్బంది,పెండేకల్లు ఆర్ఎస్ ప్రజలు,మారేళ్ళ గ్రామ ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చబోలు గ్రామంలో గ్రామ సచివాలయం ప్రారంభం


## ఎమ్మెల్యే శిల్పా రవి





నంద్యాలఅక్టోబరు 27, ( విభారె):- నంద్యాల మండలంలోని చబోలు గ్రామంలో యమ్ డి ఓ భాస్కర్ ఆధ్వర్యంలో 40 లక్షల రూపాయలతో నూతన గ్రామ సచివాలయన్ని నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి బుధవారం నాడు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల మండలం చాబోలు గ్రామంలో 40 లక్షల రూపాయలతో గ్రామ సచివాలయం ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామాలలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఉన్న సమస్యలను సచివాలయ వ్యవస్థ వాలంటరీ వ్యవస్థ ద్వారా సచివాలయంలోని పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. రాష్ట్రంలో వైయస్సార్ ప్రభుత్వం పెట్టిన నవరత్నాలు ప్రతి పేదవాడికి అందే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి పథకం ప్రజలకు ఒక రత్నం లా ఉన్నాయని ప్రజలు కూడా ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు. నంద్యాల నియోజకవర్గ ప్రజల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైయస్ ఆర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీరు ఎప్పుడూ కంప్యూటర్ ను చూస్తుంటారా? అయితే కంటి పట్ల ఈ జాగ్రత్తలు చాలా అవసరం




కంప్యూటర్లు ఈ రోజు మనం జీవిస్తున్న విధానాన్ని మార్చాయి, వాటిపై ఆధారపడటాన్ని ఒక క్షణం కూడా వదలకుండా ఉండటం అసాధ్యం. తత్ఫలితంగా, మనం అనివార్యంగా కంప్యూటర్ సిస్టమ్‌ను ఏదో ఒక విధంగా భానిసలం అవుతున్నాము. మిలియన్ల మంది ప్రజలు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉపాధి పొందారు మరియు జీవన ప్రమాణం గతంలో కంటే ఎక్కువగా పెరిగింది. అందువల్ల, పని కోసం కంప్యూటర్లను ఉపయోగించడం మరియు కంప్యూటర్ స్క్రీన్‌ను ఎక్కువ కాలం చూడటం అత్యవసరం. కంప్యూటర్ వినియోగదారులు రోజుకు కనీసం ఎనిమిది నుండి తొమ్మిది గంటలు స్క్రీన్‌ను చూడాలి. వారి మిగిలిన సమయాన్ని సోషల్ మీడియా, ఆటలు మరియు వారి మొబైల్‌లలో వ్యక్తిగత సమాచారం కోసం సమయం వెచ్చిస్తారు. కంప్యూటర్ స్క్రీన్ పుస్తకం లాంటిది కాదు, ఎందుకంటే ఇది కాంతి-ఉద్గార పరికరం. పుస్తకం కాంతిని ప్రతిబింబించడం ద్వారా సమాచారాన్ని అందిస్తుంది. ఇది కళ్ళలో ఒత్తిడి మరియు అలసటకు కారణం. ప్రకృతి ప్రసాదించిన వరం మన కళ్ళు. చాలా సున్నితమైన ఈ కళ్ళకు ప్రతిబింబించే కాంతి మీద ఆధారపడుతుంది. అయినప్పటికీ, నేటి చాలా పరికరాలు కాంతి వనరు, ఇది కళ్ళను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ఈ ప్రభావం యొక్క ఫలితం కంప్యూటర్ దృష్టి సిండ్రోమ్ లేదా కంప్యూటర్ దృష్టి నష్టం. నేడు, ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఆరు మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తోంది. కంప్యూటర్ స్క్రీన్ చూడకుండా ఉద్యోగ నిర్వహణ సాధ్యం కాదు. ఈ పరిస్థితిలో కళ్ళ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి మరియు మునుముందు వచ్చే సమస్యల నుండి రక్షణ అవసరం. నేటి వ్యాసం దీనిపై చాలా విలువైన సమాచారాన్ని అందిస్తుంది, మరియు దానిని అనుసరించడం ద్వారా మీరు కంటి భంగిమలను నివారించవచ్చు మరియు ప్రకృతి యొక్క ఈ విలువైన బహుమతిపై మీ కళ్ళను ఉంచవచ్చు. కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ అంటే ఏమిటి? పేరుకు తగ్గట్లుగా ప్రకాశించే ఏదైనా స్క్రీన్‌ను స్థిరంగా చూడటం ద్వారా ఎదురయ్యే మొత్తం ఇబ్బందుల ద్వారా ఈ పేరును సంగ్రహించవచ్చు. సాధారణంగా నేత్ర వైద్య నిపుణులు ఈ పరిస్థితిని డిజిటల్ కంటి జాతిగా గుర్తిస్తారు. కంప్యూటర్ స్క్రీన్‌ను క్రమం తప్పకుండా చూసే 50% -90% మందికి ఈ సమస్య ఉందని పరిశోధకులు కనుగొన్నారు. ఈ సమస్యను పెద్దలు మాత్రమే కాకుండా, కంప్యూటర్ స్క్రీన్లు మరియు ఎక్కువ కాలం టీవీ చూసే పిల్లలు కూడా కవర్ చేయవచ్చు. ముఖ్యంగా కాంతి పరిమాణం ఎక్కువగా ఉంటే మరియు టీవీ కంప్యూటర్ స్క్రీన్‌ల వీక్షణ దూరం చాలా తక్కువగా ఉంటే, ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంటుంది. కంప్యూటర్ స్క్రీన్ దృష్టిని ఎలా ప్రభావితం చేస్తుంది? కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ ఉన్నవారు తమ అరచేతుల్లో ఒక చిన్న సూదితో గుచ్చినట్లుగా అనిపించవచ్చు మరియు లోపలి షాక్‌ని అనుభవిస్తారు. అరచేతిపై సూచించాల్సిన నరాలు దీనికి కారణం. అదేవిధంగా, ఒకే రకమైన పనిని ఓవర్‌లోడ్ చేయడం వల్ల పునరావృతమయ్యే గాయాల సమస్యలకు కూడా ఇది కారణం. కంప్యూటర్ విజన్ సిండ్రోమ్‌కు కూడా ఇలాంటి కారణం ఉంది. అంటే కళ్ళ నుండి అందుకున్న సమాచారం నిరంతరాయంగా మరియు ఎక్కువసేపు ఉపయోగించబడుతుంది, దీనివల్ల ఈ నరాలు విశ్రాంతి పొందుతాయి. కంప్యూటర్ స్క్రీన్‌ను నిరంతరం చూసేటప్పుడు, కళ్ళు ఈ భాగంపై దృష్టి పెట్టాలి మరియు ఎక్కువ సమయం ఈ భాగంపై దృష్టి పెడుతుంది. స్క్రీన్ మధ్యలో రాయడం లేదా ఇతర పనుల కోసం దృష్టిని కూడా మార్చండి. అలాగే, తెరపై నిరంతరం మారుతున్న దృశ్యాలకు అనుగుణంగా కంటి చూపు మారాలి. ఈ సాధారణ ఫంక్షన్ వాస్తవానికి చాలా క్లిష్టంగా ఉంటుంది, కంటి కండరాల యొక్క అధిక పనితీరు, మన శరీరంలోని కండరాలు ఏవైనా వాటి సామర్థ్యానికి మించి పనిచేస్తున్నప్పుడు నొప్పిని అనుభవించడం సాధారణం. కళ్ళ కండరాలకు కూడా ఇది వర్తిస్తుంది. కంప్యూటర్ విజన్ సిండ్రోమ్‌కు కారణమేమిటి? ఇవి చాలా సాధారణ కారణాలు × యాంటీ గ్లేర్ లేదా రిఫ్లెక్టివ్ గ్లాసెస్ స్థిరంగా ధరించడం లేదు × కళ్ళ ముందు ఫ్లోటర్స్ × ఎర్రబడిన కళ్ళు × పొడి కళ్ళు × తలనొప్పి × వెనుక లేదా మెడలో నొప్పి నా ‘ కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ డిటెక్షన్ నేత్ర వైద్యుడు రోగి కళ్ళను పరిశీలిస్తాడు మరియు చాలా సాధారణ పరిస్థితులను నమోదు చేస్తాడు. ఈ సమస్య ప్రాథమిక పరీక్షలో రోగి కంప్యూటర్ స్క్రీన్ నుండి రోగి ఎంత దూరం కూర్చున్నాడు మరియు స్క్రీన్ ఎలా చూస్తాడు వంటి వివరణాత్మక సమాచారాన్ని పొందుతాడు. రోగి ఎంతసేపు స్క్రీన్‌ను చూస్తాడు మరియు ఇతర లక్షణాలు ఏమిటో నేత్ర వైద్యులు సమాచారం పొందవచ్చు. ఒక వేళ మీకు కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ ఉందని మీకు ఖచ్చితంగా తెలిస్తే, మీ దినచర్యను మార్చమని మీ డాక్టర్ మీకు సలహా ఇవ్వవచ్చు. కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ చికిత్స కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ ఉనికిని నిర్ధారించిన తర్వాత మీరు మీ నేత్ర వైద్యుడిని క్రమం తప్పకుండా సంప్రదించాలి మరియు నిపుణుల సలహాను పాటించాలి. ఇది ఇప్పటికే ఉన్న దృష్టి క్షీణించకుండా చేస్తుంది.

# యంగ్ హీరో నలుగురు పిల్లల ముచ్చట్లు



హీరో నిఖిల్ సిద్దార్థ్ ఎప్పుడు లేనంత స్పీడ్ గా సినిమాలు చేస్తున్నాడు. ఇప్పటికే కార్తికేయ 2 మరియు 18 పేజెస్ సినిమా లు షూటింగ్ చివరి దశలో ఉన్నాయి. ఈ రెండు సినిమాలు కాకుండా మరో రెండు సినిమాలు కూడా పట్టాలెక్కాయి. కెరీర్ ఆరంభించినప్పటి నుండి ఇప్పటి వరకు కూడా సిద్దార్థ్ ఒకదాని తర్వాత ఒకటి అన్నట్లుగా సినిమాలు చేస్తూ వచ్చాడు. కాని ఇప్పుడు ఏకంగా నాలుగు సినిమాలను లైన్ లో పెట్టడం అందరికి ఆశ్చర్యంగా ఉంది. కరోనా వల్ల ఎప్పుడో విడుదల అవ్వాల్సిన సినిమాలు కార్తికేయ 2 మరియు 18 పేజెస్ ఆలస్యం అయ్యాయి. కరోనా లాక్ డౌన్ సమయంలో వరుసగా కథలు విన్న నిఖిల్ పలు కథలకు ఓకే చెప్పాడు. అందులో రెండు కథలు పట్టాలెక్కించారు.తాజాగా హీరో నిఖిల్ మాట్లాడుతూ తాను గతంలో ఎప్పుడు లేనంత స్పీడ్ గా సినిమాలు చేస్తున్నాను. ఇంతకు ముందు ఒక్కో సినిమా చొప్పున చేశాను. కాని ఇప్పుడు మాత్రం నాలుగు సినిమాలు ఒకేసారి చేస్తున్నాను. ఈ నాలుగు సినిమాలు కూడా నాకు నలుగురు పిల్లల మాదిరిగా అన్నాడు. అన్ని సినిమాలు కూడా నాకు సమానం. ప్రతి సినిమా కోసం నా పిల్లలకు ఎంత ఎఫర్ట్ అయితే ఇస్తానో అంతగా ఇస్తాను అన్నట్లుగా వ్యాఖ్యలు చేశాడు. మొత్తానికి నిఖిల్ వరుసగా తాను చేస్తున్న సినిమాలపై చాలా నమ్మకంతో కనిపిస్తున్నాడు. ఈ నాలుగు సినిమాలు కూడా ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కనుక తప్పకుండా సక్సెస్ అవుతాయని ఆయన సన్నిహితులు అంటున్నారు.కార్తికేయ సూపర్ హిట్ అయ్యింది కనుక సహజంగానే కార్తికేయ 2 పై అంచనాలు భారీగా ఉంటాయి. అందుకు తగ్గట్లుగానే ఆ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇక సుకుమార్ రైటింగ్స్ తో పాటు గీతా ఆర్ట్స్ లో రూపొందుతున్న సినిమా కనుక 18 పేజెస్ కూడా అంచనాలను భారీగా మోస్తుంది. సుకుమార్ శిష్యుడు సూర్య ప్రతాప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఇది. పైగా ఈ సినిమాకు సుకుమార్ రచన సహకారం కూడా ఉందనే వార్తలు వస్తున్నాయి. కనుక సహజంగానే 18 పేజెస్ పై ఆసక్తి అందరిలో కనిపిస్తుంది. ఇప్పటికే విడుదల అయిన నిఖిల్ మరియు అనుపమ పరమేశ్వరన్ కు సంబంధించిన పోస్టర్స్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ రెండు సినిమాలతో పాటు మరో రెండు సినిమాలు కూడా అంతే ప్రత్యేకతను సంతరించుకున్నాయి కనుక ఈ నాలుగు సినిమాలు కూడా నిఖిల్ కెరీర్ ను మరో లెవల్ కు తీసుకు వెళ్తాయో చూడాలి.

# ‘ఉమ’ చిత్రం నుంచి కాజల్ షేర్ చేసిన ఆసక్తికరమైన పోస్టర్..!




దక్షిణాది స్టార్ హీరోయిన్లలో ఒకరైన కాజల్ అగర్వాల్.. సినిమా ఇండస్ట్రీకి వచ్చి 16 ఏళ్లైనా కూడా ఇప్పటికీ అదే జోరు చూపిస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న బాలీవుడ్ మూవీ “ఉమ”. పెళ్లి తర్వాత కాజల్ ఓకే చేసిన ఫస్ట్ హిందీ సినిమా ఇది. ఇప్పటికే ఆమె పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేసింది. అయితే మంగళవారం సోషల్ మీడియా వేదికగా ఉమా చిత్రం నుంచి ఓ ఆసక్తికరమైన పోస్టర్ ని కాజల్ షేర్ చేసింది.’ఉమ’ పోస్టర్ లో బ్యూటిఫుల్ కాజల్ అగర్వాల్ ఒక పక్క గ్రామో ఫోన్.. మరోపక్క ఓ గొడుగు మధ్యలో స్టైల్ గా నిలబడి ఉంది. కాళ్ళ వద్ద కాగితంతో చేసిన బొమ్మలు కనిపిస్తున్నారు. అంతేకాదు ఆమె వెనుక ఉన్న బోర్డుపై ఏడుగురి ఫొటోలు పిన్ చేయబడి ఉన్నాయి. ఈ చిత్రంలో టిన్ను ఆనంద్ - మేఘనా మాలిక్ - హర్ష్ ఛాయా - గౌరవ్ శర్మ - శ్రీశ్వర - అయోషి తాలుక్దార్ మరియు కియాన్ శర్మ తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషించినట్లు తెలుస్తోంది.ఉమా అనే అపరిచితురాలు ఓ పెళ్లి ఇంట్లోకి వెళ్లిన తర్వాత.. అక్కడ ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయనే కాన్సెప్ట్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో కాజల్ ఉమా పాత్రలో కనిపించనుంది. నూతన దర్శకుడు తథాగత సింఘా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మిరాజ్ క్రియేషన్స్ సమర్పణలో ఎంఓం మీడియా సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మంత్రరాజ్ పలివాల్ - అవికేష్ ఘోష్ - మనీషా దీనికి నిర్మాతలు. ప్రముఖ దర్శకుడు సుజోయ్ ఘోష్ ఈ మూవీకి క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ‘ఉమ’ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇకపోతే కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ‘ఆచార్య’ ‘హే సినామిక’ సినిమాల షూటింగ్స్ కూడా ఇప్పటికే పూర్తి చేశారు. మెగాస్టార్ చిరంజీవి తో కలిసి చేస్తున్న ‘ఆచార్య’ సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరి 4న విడుదల కానుంది. ఇదిలా ఉంటే అందాల చందమామ కాజల్ కు పెళ్ళైనప్పటికీ.. ప్రెగ్నెంట్ అని వార్తలు వస్తున్నా ఫ్యాన్ ఫాలోయింగ్ ఏమాత్రం తగ్గలేదని అర్థం అవుతోంది. సోషల్ మీడియాలో బాగా యాక్టివ్ గా ఉండే కాజల్.. ఇన్స్టాగ్రామ్ లో 20 మిలియన్ ఫాలోవర్స్ మార్క్ ను అందుకుంది.

# టెన్షన్లు అన్నీ జక్కన్నకే వదిలేసారు



మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ ఆర్.ఆర్.ఆర్ సంక్రాంతి 2022 కానుకగా విడుదలవుతున్న సంగతి తెలిసిందే. వందల కోట్ల బిజినెస్ చేసిన ఈ సినిమా ప్రమోషన్స్ కోసం జక్కన్న టీమ్ ఇప్పటికే భారీ ప్లానింగ్ తో సిద్ధమవుతోంది. అయితే చరణ్ - తారక్ ప్రమోషన్స్ కోసం ప్రత్యేకించి షెడ్యూల్ ని డిజైన్ చేయనున్నారు. ఇక హీరోలకు సినిమా ప్రచారం వరకూ బాధ్యత. ఇతర బాక్సాఫీస్ లెక్కలు.. రిటర్నుల వగైరా వ్యవహారాలన్నీ దర్శకుడిదే బాధ్యత. ఇక సినిమా జయాపజయాల విషయంలో కూడా ఆ హీరోలకు టెన్షన్ లేనే లేదట. ఆ మేరకు దర్శకుడు రాజమౌళి ఆ బాధ్యతలన్నీ తీసుకున్నారు.వందల కోట్ల బడ్జెట్ పెట్టిన సినిమా ఎలా ఆడుతుందోనని హీరోలు ఆలోచించాల్సిన పని లేదు. సినిమా చూస్తున్నంత సేపూ ఆడియెన్ కి తమ పాత్రలు ఎలా కనెక్టయ్యాయి? అన్నదే ఇప్పుడు తారక్- చరణ్ లకు టెన్షన్ పెట్టే ఏకైక అంశం. బిజినెస్ పరంగా తమకు ఎలాంటి సంబంధం లేదు కాబట్టి కూల్ గా థియేటర్లో ఆడియెన్ మధ్యలో కూర్చుని రెస్పాన్స్ ఎలా ఉందో చెక్ చేసుకోవడమే ముఖ్యమని భావిస్తున్నారట. ఇక ప్రచార కార్యక్రమాల్లో మాత్రం దర్శకనిర్మాతలకు సహకరిస్తారు అంతే.ఇప్పటికే అద్భుతమైన ఫైనల్ కట్ తో సినిమా రెడీ అవుతోందని పెట్టిన పెట్టుబడికి నాలుగింతలు తెచ్చే దమ్ము సినిమాలో ఉందని దర్శకనిర్మాతలు సహా హీరోలు భావిస్తున్నారట. ఆర్.ఆర్.ఆర్ 7 జనవరి 2022 విడుదలవుతున్న సంగతి తెలిఇందే. 2022 సంక్రాంతి బరిలో రిలీజవుతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రమిది. ఇప్పటికే జాతీయ స్థాయిలో మార్మోగేలా ఈ సినిమా ప్రమోషన్స్ కి ఏర్పాట్లు సాగుతున్నాయి.

# అలా అయితేనే టీమిండియా సెమీస్‌కు.. లేదంటే..



“పాకిస్తాన్ విజయంలో భారత అభిమానుల ప్రార్థనలు కూడా ఉన్నాయి... పాక్ న్యూజిలాండ్‌ను ఓడించడం వాళ్లకు సంతోషాన్నిచ్చింది. ఎందుకంటే.. మనం ఈరోజు కివీస్ చేతిలో ఓడి ఉంటే కోహ్లి సేన ఇబ్బందుల్లో పడేది. ఒక రకంగా మనం వాళ్లను సేవ్ చేసినట్లే.. ఫైనల్‌లో టీమిండియా కోసం ఎదురుచూద్దాం”- అక్టోబరు 26న పాకిస్తాన్ న్యూజిలాండ్‌ను ఓడించిన తర్వాత ఆ దేశ మాజీ బౌలర్ షోయబ్ అక్తర్ చేసిన వ్యాఖ్యలు ఇవి.అవును.. నిజమే అతడు అన్న మాటల్లో వాస్తవం ఉంది. ఒకవేళ పాక్ గనుక కివీస్‌పై విజయం సాధించకపోయి ఉంటే కోహ్లి సేన కష్టాల్లో పడేది. టీ20 వరల్డ్‌కప్-2021 టోర్నీలో ముందుకు సాగాలంటే.. భారత్‌తో పాటు పాకిస్తాన్ కూడా విలియమ్సన్ బృందంపై తప్పక గెలుపొంది తీరాలి. బాబర్ ఆజం టీమ్ వాళ్ల పని పూర్తి చేసింది. ఇక అక్టోబరు 31 నాటి మ్యాచ్‌లో టీమిండియా కివీస్‌ను చిత్తు చేస్తేనే సెమీస్ చేరే అవకాశం ఉంటుంది. అదెలాగో ఓ సారి పరిశీలిద్దాం.టీ20 ప్రపంచకప్-2021 టోర్నీ సూపర్-12లో రెండు గ్రూపు-1, గ్రూప్-2లు ఉన్నాయి. క్వాలిఫైయర్స్‌లో భాగంగా గ్రూపు-ఏ, గ్రూపు-బి టాపర్లుగా నిలిచిన నాలుగు జట్లలో.. గ్రూపు-1లో రెండు, గ్రూపు-2లో రెండు చేరాయి.గ్రూపు-2 విషయానికొస్తే.. సూపర్-12కు నేరుగా అర్హత సాధించిన.. 4 జట్లలో భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, అఫ్గనిస్తాన్ ఉన్నాయి. లీగ్ దశలో భాగంగా.. తొలిసారిగా టోర్నీకి అర్హత సాధించిన నమీబియాతో పాటు స్కాట్లాండ్ సంచలన విజయాలు నమోదు చేసి ఈ గ్రూప్‌లో చేరాయి.ఇక పాయింట్ల పరంగా చూసుకుంటే... పాకిస్తాన్ ఇప్పటికే టీమిండియా, న్యూజిలాండ్‌పై వరుస విజయాలతో 4 పాయింట్లు సాధించింది. తద్వారా ప్రస్తుతం గ్రూపు-2 టాపర్‌గా కొనసాగుతోంది. ఈ క్రమంలో తమకు తదుపరి మ్యాచ్‌లలో ఎదురయ్యే పసికూనలు అఫ్గానిస్తాన్, నమీబియా, స్కాట్లాండ్‌ను ఓడిస్తే.. మరో ఆరు పాయింట్లు.. అంటే మొత్తంగా 10 పాయింట్లు వస్తాయి. దీంతో సెమీస్ బెర్తు దాదాపు ఖాయమైనట్లే. బాబర్ ఆజం బృందం ఫామ్ చూస్తుంటే సెమీ ఫైనల్ చేరడం అంతకష్టం కాదని స్పష్టమవుతోంది.మరోవైపు.. స్కాట్లాండ్‌పై 130 పరుగుల తేడాతో విజయం సాధించి అఫ్గనిస్తాన్(2 పాయింట్లు) సైతం బోణీ కొట్టింది. రన్‌రేటు పరంగా పాకిస్తాన్ కంటే కూడా ఎంతో మెరుగ్గా ఉంది. ఆ జట్టును కూడా తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు.ఈ నేపథ్యంలో పాకిస్తాన్ చేతిలో 10 వికెట్ల తేడాతో ఓడిన టీమిండియాకు ఇకపై ఆడే ప్రతీ మ్యాచ్ కీలకంగా మారింది. గెలిస్తేనే ముందుకు సాగే పరిస్థితి. గ్రూపు-2లో మిగిలిన మూడు చిన్న జట్లతో పాటు బలమైన న్యూజిలాండ్‌ను కోహ్లి సేన తప్పక ఓడించాలి. అలా అయితేనే భారత్‌కు 8 పాయింట్లు వస్తాయి. ఇదిలా ఉంటే... న్యూజిలాండ్‌ది కూడా ఇదే పరిస్థితి.ఇంతవరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు కాబట్టి... మిగిలిన నాలుగు మ్యాచ్‌లు గెలిస్తేనే సెమీస్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివారం నాటి పోరు ఇరు జట్లకు కీలకంగా మారింది. ఒకవేళ పాకిస్తాన్ గనుక కివీస్‌ను ఓడించి ఉండకపోతే... మన పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. కాగా గ్రూపు-1, గ్రూపు-2లో టాప్-2గా నిలిచిన నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు చేరతాయన్న సంగతి తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190